



ఉప్పొంగిన యువ తరంగం

ఏలూరులోని సెయింట్ థెరిసా కళాశాలలో జిల్లా యువజన సేవల శాఖ(సెట్‌వెల్) ఆధ్వర్యాన గురువారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి యువతీ యువకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శనలు అలరించాయి. - **న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్**

6లో

జగజ్జననికి నీరాజనం

ఏలూరు తిలక్‌నగర్‌లోని అమ్మవారి ఆలయంలో విజయ దశమి వేడుకలు గురువారం ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు శిరస్సున కలశాలు ఎత్తుకుని మంగళ వాయిద్యాల నడుమ నగర వీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. - **న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**



ఉపాధికి వేదిక.. పారిశ్రామిక వీచిక

ఒక్కో క్లస్టర్‌కు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, జంగారెడ్డి గూడెం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం అటకెక్కించిన పారిశ్రామిక ప్రగతికి ఎన్డీయే సర్కారు ఊపిరినిస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రణాళిక రూపొందించింది. భీమవరంలో ఆక్వా వ్యర్థ పదార్థాల శుద్ధి, యలమంచిలిలో కొబ్బరి ఉత్పత్తుల మార్కెటింగ్, దువ్వలో ప్రింటింగ్ ఆధారిత పరిశ్రమ, ఏలూరులో కార్పెట్ మేకింగ్, గోల్డ్ జ్యూయలరీల అభివృద్ధికి (ఒక్కో క్లస్టర్‌కు)కు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు చేశారు.

1 బంగారం


నరసాపురం, తణుకు, భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, ఏలూరు పట్టణాల్లో ఆయా దుకాణాలను బట్టి రోజూ రూ. కోట్లలో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. బంగారం కొనుగోలులో చోటు చేసుకుంటున్న మోసాలు, అందులోని నాణ్యతా ప్రమాణాలను గుర్తించేందుకు ఏలూరులో ఒక క్లస్టర్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి.

దుకాణాలు: 740
టర్నోవర్ రూ.12 కోట్లు (రోజుకు)

2 ఆక్వాకు ఊతం

ఆక్వా పరిశ్రమల వ్యర్థాల శుద్ధికి ప్రతిపాదనలు చేశారు. రొయ్యలు, చేపలు పట్టుబడి తర్వాత భద్రపరిచేందుకు శీతలీకరణ గిడ్డంగులు లేవు. నాణ్యమైన సీడ్, మేతలు, మందులు దొరక్క రైతులు నష్టపోతున్నారు. వాటిని నివారించేందుకు చర్యలు చేపట్టబోతున్నారు.

సాగు: 2.60 లక్షల ఎకరాలు | టర్నోవర్: రూ.18 వేల కోట్లు



3 ప్రింటింగ్

దువ్వలో ప్రింటింగ్ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ప్రింటింగ్‌కు సంబంధించి అనేక చిన్న పరిశ్రమలున్నప్పటికీ ఎక్కువగా విజయవాడపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు అసోసియేషన్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా జపాన్ పరిజ్ఞానంతో తక్కువ ధరకు క్వాలిటీ అందించే పరికరాలు అందుబాటులోకి రానున్నాయి.

దుకాణాలు : 980 | ఆధారపడిన వారు: 1800

4 కొబ్బరి

పాలకొల్లు కేంద్రంగా కొబ్బరి మార్కెటింగ్ జరుగుతోంది. ఇటీవల కాలంలో కొబ్బరి ఉత్పత్తులు పెరగడం, ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతులు ఊపందుకోవడంతో యలమంచిలిలో కొబ్బరి అనుబంధ పరిశ్రమ స్థాపనకు ప్రణాళిక రూపొందించారు. దింపు, ఒలుపు, ఇతర కార్మికులకు ఉపాధి కలగనుంది.

సాగు విస్తీర్ణం: 49,500 ఎకరాలు
రైతులు: 36 వేలు | దింపు, ఒలుపు కార్మికులు: 8 వేలు

కుట్లు.. అల్లికలు..

నరసాపురం మండలం సీతారాంపురంలో కేంద్ర జౌళిశాఖ నేతృత్వంలో కేంద్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేసుపార్కు ఏర్పాటు చేశారు. అనుసంధానంగా 51 సొసైటీలు ఏర్పాటు చేసి, మహిళలకు అల్లికల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు శ్రమకు తగిన ఫలితం దక్కేందుకు వీలుగా డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో అలంకృతి మినీ లేస్‌పార్కుల పేరిట భవనాలు నిర్మించారు.

ఆకట్టుకునే హస్తకళ

సొసైటీ ఫర్ హెల్త్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ సంస్థ ఇంటి నుంచి మహిళలు తయారు చేసిన హస్తకళలను ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ చేసుకునేందుకు శిక్షణ ఇచ్చింది. యలమంచిలి, బాడవ, వై.వి.లంక, వీరవాసరం, నవుడూరు, నరసాపురం, ఎల్.బి.చర్ల, మొగల్తూరు, కేపీ పాలెం, తణుకు తదితర చోట్ల ఎంతోమంది శిక్షణ పొందారు.

★ 2019 సచివాలయ ఏఎన్‌ఎం ఉద్యోగుల ఎంపికలో ఓ అభ్యర్థికి మెరిట్ జాబితాలో 20వ స్థానం లోపే వచ్చింది. ఇప్పుడు పదోన్నతుల జాబితాలో అదే స్థానం ఉండాలి. కానీ అసలు అర్హత లేని మరో ఉద్యోగి పేరు ఉంది.

★ 'మీరు సచివాలయ ఆరోగ్య కార్యదర్శిగా పని చేస్తున్నారు కదా.. పదోన్నతుల జాబితాలో మీ పేరు ఉండాలంటే రూ.10వేలు ఇవ్వాలి.' అంటూ ఓ మహిళ నుంచి ఏలూరుకు చెందిన ఓ ఉద్యోగికి ఫోన్ వచ్చింది. దీంతో ఆ మేర నగదు సమర్పించుకున్నారు.

కాసులిస్తే.. పదోన్నతి

- వైద్య ఆరోగ్య శాఖలో అడ్డగోలు దందా
- ఆరోగ్య సహాయకుల ఎంపికకు బేరాలు

ఈనాడు, ఏలూరు: వైద్యారోగ్యశాఖలో పదోన్నతుల విషయంలో అడ్డగోలు దందాకు తెర తీశారు. సచివాలయాల ద్వారా ఎంపిక చేసినఆరోగ్య కార్యదర్శులను ఆరోగ్య సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొందరు అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. వందల మంది నుంచి భారీగా వసూళ్లు చేసి వాటాలు వేసుకున్నారు.



చక్రం తిప్పిన ఉన్నతాధికారి.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1087 ఆరోగ్య కార్యదర్శు (సచివాలయ ఏఎన్‌ఎం)లను నియమించారు. తాజాగా వీరిలో మెరిట్ ప్రకారం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లుగా నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో దాదాపు 230 మందికి పదోన్నతులకు అవకాశం ఉంది. ఇదే అదనుగా వైద్య ఆరోగ్యశాఖలో ఓ మహిళా అధికారి, ముగ్గురు సిబ్బంది ద్వారా వసూళ్ల దందా చేయించారు.

రూ.లక్షల్లో వసూళ్లు.. 2019లో ఇచ్చిన మెరిట్ జాబితాలో మొదటి 230 మంది ప్రస్తుత పదోన్నతులకు అర్హులు. ఉన్నతాధికారి ప్రోద్బలంతో ముగ్గురు సిబ్బంది జాబితాలోని వారందరికీ ఫోన్లు చేస్తున్నారు. మీ పేరు పదోన్నతుల జాబితాలో కొనసాగాలంటే రూ.10 వేలు ఇవ్వాలని, లేదంటే మీ పేర్లు గల్లంతవుతాయని, ఆపై అంతా మీ ఇష్టం అంటూ పరోక్షంగా బెదిరింపులకు దిగారు. ఇప్పటికే దాదాపు 200 మంది నుంచి రూ.20 లక్షల వరకు వసూలు చేశారు.

బాల్య వివాహాలతో అనర్థాలే: కలెక్టర్


మాట్లాడుతున్న వెట్రిసెల్వి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో మిషన్ వాత్సల్య రెండో త్రైమాసిక సమావేశం శనివారం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే టోల్ ఫ్రీ నంబరు 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ నంబరుపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పద్దెనిమిదేళ్లలోపు వయసున్న వారికి ప్రభుత్వం మిషన్ వాత్సల్య ద్వారా సంరక్షణ అందిస్తోందన్నారు. బాలలంతా బాగా చదువుకొని ప్రయోజకులయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ.. ఇటీవల కొన్ని వసతి గృహాలు తనిఖీ చేయగా- అనేక లోపాలు కనిపించాయన్నారు. వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిరాదరణకు గురైన బాలలకు మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ.4 వేలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖాధికారిణి పద్మావతి, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, డీఈవో ఎస్.అబ్రహం, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, ఇతర అధికారులు పాల్గొన్నారు.





కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు మోహిని అలంకారంలో స్వామివారు, పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఆలయ అధికారులు తదితరులు

పరమానందం.. శ్రీనివాసుడి పరిణయం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: కలియుగ ప్రత్యక్ష దైవం ద్వారకా తిరుమల శ్రీనివాసుడు పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పరిణయమాడిన ఘట్టం భక్తులకు నేత్రపర్వమైంది. ఆశ్వయుజ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వేర్వేరు వాహనాలపై మండపానికి తీసుకొచ్చారు. సుముహూర్త సమయాన జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, దేవస్థానం ఛైర్మన్ సుధాకరరావు, ఈవో మూర్తి, అనువంశిక ధర్మకర్త నివృతరావు ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. వెండి గరుడ, సింహ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించారు. స్వామివారు మోహిని అలంకరణలో దర్శనమిచ్చారు. ● కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఏడు గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుంది.



మావుళ్లమ్మ మండల దీక్షాధారణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో అమ్మవారి మండల దీక్షాధారణ పూజలు గురువారం ఉదయం 4.30కు నేత్రపర్వంగా నిర్వహించారు. 104 మంది భక్తులు దీక్షలు స్వీకరించగా ప్రధానార్చకుడు, గురుమాత మద్దిరాల మల్లికార్జునశర్మ సామూహికంగా పూజలు చేయించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయప్రాంగణం మార్మోగింది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తులు 2,771

- ముసాయిదా జాబితాలో 13,677 మందికి ఓటు
- వచ్చేనెల 6న తుది జాబితా ప్రచురణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు ప్రక్రియ ముగిసింది. జులై 29 నుంచి ఈ నియోజకవర్గంలో ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. సెప్టెంబరు 3 వరకు కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో ఫారం-19 ద్వారా ఓటుకు దరఖాస్తులు స్వీకరించారు. 14,191 మంది దరఖాస్తు చేయగా, పరిశీలించి 13,677 మందికి ఓటుహక్కు కల్పించారు. గతనెల 24న ముసాయిదా జాబితా ప్రచురించారు. అప్పటి నుంచి ఈనెల 15 వరకు అర్హుల నుంచి మరోసారి దరఖాస్తులు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ నిర్వహించారు. గతనెల 24 నుంచి ఈనెల 15 వరకు కొత్తగా 2,771 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిపైన, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈనెల 30లోగా విచారణ నిర్వహిస్తారు. నవంబరు 6న తుది జాబితా ప్రచురిస్తారు.

జిల్లాల వారీగా కొత్తగా వచ్చిన దరఖాస్తుల సంఖ్య	
ఏలూరు	: 284
పశ్చిమగోదావరి	: 749
కాకినాడ	: 387
తూర్పుగోదావరి	: 611
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	: 609
అల్లూరి సీతారామరాజు	: 131

తగ్గనున్న ఓటర్ల సంఖ్య.. 2021 మార్చిలో ఈ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికలకు పీడీఎఫ్ అభ్యర్థిగా షేక్‌సాబ్జీ విజయం సాధించారు. రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. నవంబరు, డిసెంబరులో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గెలిచిన అభ్యర్థికి 2027 మార్చి వరకే పదవీ కాలం ఉంటుంది. 2021లో జరిగిన ఎన్నికల్లో 17వేల మందికి పైగా ఓటర్లు ఉండగా, ఈసారి ఈ సంఖ్య తగ్గనుంది. తుది జాబితాలో 15వేల పైచిలుకు ఓట్లు మాత్రమే ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులు, ముసాయిదా జాబితా అభ్యంతరాలపై విచారణ పూర్తి చేసి, నవంబరు 6న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

☛ ఏలూరు నగర శివారు సత్యనారాయణపురం సమీప జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. మూణ్నెల్ల కిందట దుర్ఘటన సంభవించగా- కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.

☛ ఏలూరు మినీ బైపాస్ గ్రీన్ సిటీ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు.



☛ ఆగస్టులో 10వ నంబరు జాతీయ రహదారిపై పూళ్ల వద్ద ఓ లారీ టైరు పంక్చర్ కావడంతో నిలిపివేశారు. ఏలూరు వైపు నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారు లారీని ఢీకొని మృతి చెందారు.


'కలపర్రు టోల్‌గేటు నుంచి తాడేపల్లి గూడెం, తణుకు వరకు జాతీయ రహదారిపై ఒక్క పార్కింగ్ స్థలమూ లేదు. వాహనదారులు అలిసిపోతే... రోడ్ల పక్కన వాహనాలు ఆపి విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది.'

రోడ్ల అంచుల్లో.. మృత్యు శకటాలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

నల్లగా.. నిగనిగలాడే నాలుగు వరుసల రహదారి.. రయ్ మంటూ దూసుకెళ్లే వాహనాలు.. కళ్లు మూసి, తెరిచేలోపు దూసుకెళ్లిపోయే కార్లు.. జాతీయ రహదారులపై నిత్యం కనిపించే దృశ్యాలివి. రోడ్లపై వేగంగా, సాఫీగా సాగిపోయే ప్రయాణాలకు లారీలు, ఇతర భారీ వాహనాలు ప్రతిబంధకంగా మారుతున్నాయి. రహదారుల పక్కన నిలిపి ఉన్న వాహనాలు ప్రయాణికుల ప్రాణాలు హరిస్తున్నాయి. ఈ తరహా ప్రమాదాలు ఇటీవల జిల్లాలో అధికమయ్యాయి. బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంటోంది.

పార్కింగ్ స్థలాల్లేక.. జాతీయ రహదారుల్లో రాకపోకలు సాగించే వాహనాలను నిలుపుదల చేసుకునేందుకు రోడ్ల పక్కనే స్థలాలు ఏర్పాటు చేయాలి. దీన్ని హైవే అథారిటీ అధికారులు విస్మరించారు. రోడ్డు పక్కన హోటళ్లు, దాబాలు, పెట్రోల్ బంకుల వద్దనున్న కొద్దిపాటి ఖాళీ స్థలాల్లో వాహనాలు నిలిపి, కాసేపు సేదదీరుతున్నారు. వాహనాలు నిలిపిన చోట ఎలాంటి సిగ్నళ్లు, సూచికలు లేకపోవడంతో.. వెనుక వచ్చే వాహనాలు గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు.



నివారణ చర్యలేవీ?.. హైవే మొబైల్ బృందాల పోలీసులు రోడ్డు పక్కన ఆపిన వాహనాలను గుర్తించి.. చోదకులతో మాట్లాడాలి. వాహనం మరమ్మతుకు గురైతే వెనుక రేడియం బోర్డులు ఏర్పాటు చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేయాలి. కానీ, ఈ నిబంధనలు ఎక్కడా అమలు చేయడం లేదు. 'హైవే పెట్రోలింగ్ మొబైల్ బృంద పోలీసులు, జాతీయ రహదారిపై నున్న పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ప్రమాదాలు సంభవించకుండా నిత్యం పర్యవేక్షిస్తున్నాం.' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

కొలిక్కిరాని మద్యంతర మంతనాలు

రంగంలోకి ప్రజాప్రతినిధులు, అనుచరగణం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే : దేవుడు కరుణించినా పూజారి వరం ఇవ్వని చందంగా తయారైంది మద్యం వ్యాపారుల పరిస్థితి. సిండికేట్‌లను కాదని విడివిడిగా దుకాణాలు దక్కించుకున్న వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీనికి సంబంధించి ప్రజా ప్రతినిధుల జోక్యం వీరికి మింగుడుపడటం లేదు. జిల్లాలో కొన్ని చోట్ల ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. 30 శాతం లాభాలు ఇవ్వాలని ఓ ప్రజాప్రతినిధి వారిపై ఒత్తిడి తీసుకొస్తుండటం గమనార్హం. దుకాణం తమకు ఇస్తే.. కొంత సొమ్ము ఇస్తాం అంటూ వ్యాపారులను కొందరు ప్రజాప్రతినిధుల అనుచరులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని దుకాణాలను తమ ఖాతాలో వేసుకున్నారు. విడివిడిగా షాపులు దక్కించుకున్న కొందరు ఈ బాధ పడలేక వారికి కొంత డబ్బు ముట్టజెప్పి దుకాణాలను వాల్చుకున్నారు.

అల కల్లోలం


కేపీపాలెంబీచ్‌లో కొబ్బరితోటల్లోకి చేరిన సముద్రనీరు

మొగల్తూరు, న్యూస్‌టుడే: సముద్ర తీరంలో గురువారం అలలు కల్లోలంగా మారాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండో రోజు కడలి ఎగసిపడింది. పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్, చినమైనవానిలంక, తూర్పుతాళ్లు తదితర గ్రామాల్లో సముద్రతీరంలో అలలు సుమారు 50 మీటర్ల పైబడి భూభాగంపైకి పోటెత్తాయి. తీరంలోని కొబ్బరి, సరివి తోటల్లోకి నీరు పోటెత్తింది.

రైతుల సమ్మతితోనే రీ సర్వే ప్రక్రియ

చాట్రాయి, న్యూస్‌టుడే: నేటి నుంచి గ్రామాల్లో భూముల రీ-సర్వే గ్రామసభలు నిర్వహిస్తారు. గతంలో వైకాపా ప్రభుత్వంలో రీ-సర్వే చేసిన గ్రామాల్లోనే రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 18 నుంచి గ్రామాల్లో సభలున్నాయి. రీ-సర్వేలో విధి విధానాల్లో మార్పులున్నా గ్రామాల్లో ఇంకా వాటి ఛాయలు ఎక్కడా కన్పించడం లేదు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సర్వే రాళ్లపై ఇంకా జగన్ పేరు యథాతథంగానే ఉంది. విధి విధానాల్లో వైకాపా పాలన తరహాలో కాకుండా రైతుల సమ్మతితోనే ఈ ప్రక్రియ జరగాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించిన మేరకు మార్పులు జరగనున్నాయి. ★ తొలుత రీ-సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో సభలను నిర్వహిస్తారు. రీ-సర్వేలో నష్టపోయిన బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ★ ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ చేసి వాస్తవాలతో కూడిన సమాధానం బాధిత రైతులకు ఇస్తారు. రైతు సంతృప్తి చెందారా.. లేదా అనే అంశాన్ని సైతం పరిగణనలోకి తీసుకుంటారు. ★ గత ప్రభుత్వంలో హడావుడిగా నూజివీడు నియోజకవర్గంలో 32 గ్రామాల్లో సభలు నిర్వహించి మమ అనిపించారు. రైతుల అభ్యంతరాలు తీసుకోలేదనే విమర్శలు వచ్చాయి. ★ ప్రతి గ్రామంలో రీ-సర్వే పూర్తి చేసేందుకు నాలుగు నెలల సమయాన్ని ఇస్తారు. పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్న తర్వాతే ప్రకటన జారీ చేసి గ్రామంలో రీ-సర్వే పూర్తి చేసినట్లు గుర్తిస్తారు. పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ పేరు, ఫొటోను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాల్లో



పోతనపల్లిలో రహదారి పక్కనే సర్వే రాళ్లు

సర్వే రాళ్లు ఇంకా 'జగన్' పేరుతోనే

గ్రామాల్లో గుట్టలుగా పేరుకుపోయిన వైనం

సర్వే పూర్తి చేసే సమయంలోగా రాళ్లపై పేర్లు, ఫొటోలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేస్తుందని తహసీల్దారు దాసరి ప్రశాంతి తెలిపారు.

252 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 664 గ్రామాల్లో భూముల రీ సర్వే చేయాల్సి ఉండగా... ఇప్పటి వరకు 252 చోట్ల పూర్తి చేసినట్లు సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి నవంబరు 14 వరకు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భూ యజమానులకు రీ సర్వేపై ఏమైనా అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తీరిన ఇసుక కష్టాలు


కుక్కునూరు మండలం గుండేటివాగు నుంచి ఎడ్లబండ్లపై రవాణా

కుక్కునూరు, వేలేరుపాడు, న్యూస్‌టుడే: చాలా ఏళ్ల తర్వాత గ్రామీణులకు ఇసుక కష్టాలు తొలగిపోయాయి. గత వైకాపా హయాంలో ఊళ్ల చెంతనే లక్షల టన్నుల ఇసుక నిక్షేపాలున్నా, తట్టెడు ఇసుక తెచ్చుకొనే అవకాశం లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఇసుక విధానంలో పలు మార్పులు తీసుకొచ్చారు. తాజాగా గ్రామీణులు తమ అవసరాలకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై ఇసుక తెచ్చుకొనే వెసులుబాటు కల్పించారు. మొదట ఆధార్‌కార్డు ద్వారా కేవలం ఖర్చులు, సీనరేజీ వసూలుతో ఇసుకను ఉచితంగా పంపిణీ చేశారు.

ఆ విధానంలో రవాణా ఖర్చులు భరించలేనివిగా ఉన్నాయనీ, ఉచితం అన్న పేరేగానీ, ఖర్చు తడిసి మోపెడవుతోందంటూ ప్రజలు గగ్గోలు పెట్టారు. దీంతో ఆ విధానం మార్చి ఆన్‌లైన్ విధానం అమల్లోకి తెచ్చారు. ఈ విధానంలో రాష్ట్రమంతటా ఒకే రవాణా ఛార్జీలు అమలు చేస్తూ అతి తక్కువ ఖర్చుతో ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. తాజాగా కొత్త రీచ్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో సొంత అవసరాలకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ఎవరికీ పైసా చెల్లించకుండా ఇసుకను తెచ్చుకొనే వెసులుబాటు కల్పించారు. ఈ విధానంలో అధికారులెవరైనా , ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే వారిపై సస్పెన్షన్ వేటు వేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించడం గమనార్హం.

బాల్య వివాహం అడ్డుకునేందుకు అధికారుల పాట్లు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఓ బాలిక వివాహాన్ని అడ్డుకునేందుకు అధికారులు నానా పాట్లు పడ్డారు. చేవూరుపాలేనికి చెందిన యువకుడితో ఓ బాలికకు బుధవారం రాత్రి స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వివాహానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే పెళ్లికూతురు మైనర్ కాగా ఆమెపుడు ఆధార్ కార్డులో వివాహం చేస్తున్నట్లు అధికారులకు సమాచారం రావడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, వీఆర్వో ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, పోలీసు సిబ్బంది వివరాలు సేకరించారు. దీంతో అధికారులు ఆలయం వద్దకు వెళ్లేసరికి అక్కడ ఎవరూ లేరు.. దేవపూడిలో జరుగుతున్నట్లు సమాచారంతో అక్కడకు వెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్లకూరు ఆలయంలో జరుగుతున్నట్లు సమాచారం అందించడంతో అక్కడి అధికారులకు సమాచారమందించారు. దీనిపై ఎస్సై వెంకట కుమార్‌ను సంప్రదించగా వచ్చిన సమాచారం మేరకు సింగరాయపాలెం, దేవపూడి ఆలయాల్లో సిబ్బంది పరిశీలించి, కాళ్లకూరు ఆలయంలో జరుగుతున్నట్లు సమాచారం అందడంతో అధికారులు వెళ్లి బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక డీఈవో కార్యాలయం ఎదుట గురువారం సత్యాగ్రహ దీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ.. పురపాలక ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు తెరవాలన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. వర్గోన్నతి చెందిన పాఠ్యాంశ ఉపాధ్యాయ కొలువులు మంజూరు చేయాలని కోరారు. నాయకులు జి.వెంకటేశ్వరరావు, శివశంకరరావు, ఎన్.రాంబాబు, బి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

బరిలో దిగితే బంగారు పతకమే..!

జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న గురుకులం బాలికలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం బాలికల గురుకులం విద్యార్థినులు పలు క్రీడల్లో విశేష ప్రతిభ చూపుతున్నారు. ఈ నెల 2న పెదవేగిలో పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు అందుకున్నారు. వారిలో ముగ్గురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్‌లోనే కాకుండా ఇతర క్రీడల్లోనూ రాణిస్తున్నారు.

జట్టుకు నాయకత్వం వహించా



'రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్టుకు నాయకత్వం వహించా. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. అథ్లెటిక్స్‌లోనూ రాణించి మంచి గుర్తింపు పొందాలన్నది నా లక్ష్యం. 1500 మీటర్ల పరుగులో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాను' అని పాదం తేజస్విని తెలిపారు.

జాతీయ స్థాయిలో ఆడతా..



'రాష్ట్ర పోటీల్లో బంగారు పతకం అందుకుని.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. పదో తరగతి చదువుతున్నా. 2023లో అండర్-17 బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఆడా. జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారిణిగా గుర్తింపు సాధించాలన్నదే నా లక్ష్యం' అని నేతింగి రాణి పేర్కొన్నారు.

పోలీసు అధికారినవుతా..



'రెండేళ్లుగా సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ఆడుతున్నా. రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యా. క్రికెట్, బేస్‌బాల్, అథ్లెటిక్స్ షాట్‌పుట్, డిస్కస్‌త్రో, రేస్ వాక్‌లోనూ ప్రావీణ్యం ఉంది. భవిష్యత్తులో పోలీసు అధికారి అవుతాను' అని మలుగుమాటి హన్సిక చెప్పారు.



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారిణులు

బేస్‌బాల్‌లోనూ ప్రావీణ్యం



'సాఫ్ట్‌బాల్‌తో పాటు బేస్‌బాల్ జిల్లా జట్టులోనూ ఆడుతున్నా. 2023లో వర్తి నగర్‌లో నిర్వహించిన అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో ఆడా. తొమ్మిదో తరగతి చదువుతున్నా. సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాలన్నది నా లక్ష్యం' అని ఉప్పులూరి లిఖిత తెలిపారు.

ఆల్‌రౌండర్‌గా..



'సాఫ్ట్‌బాల్‌లో బంగారు పతకం అందుకున్నా. జాతీయ పోటీలకు ఎంపికవడం కోసం కృషి చేస్తున్నా. 2023లో సాఫ్ట్‌బాల్, కబడ్డీ రాష్ట్ర పోటీల్లో పాల్గొన్నా. కబడ్డీలో వెండి పతకం వచ్చింది. ఈ నెల శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఆడా. ఖో-ఖో, వాలీబాల్‌లో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నాను' అని జొన్నకూటి సంజన చెప్పారు.

ఉపాధ్యాయిని అవుతా..



'సాఫ్ట్‌బాల్‌లో అండర్-14లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. అండర్-19 రాష్ట్ర పోటీల్లో గెలుపొందిన ఉమ్మడి జిల్లా జట్టులో ఆడి బంగారు పతకం సాధించా. హ్యాండ్ బాల్‌లోనూ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యా. ఈ నెల 22న అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో జరగనున్న హ్యాండ్‌బాల్ రాష్ట్ర పోటీల్లో ఆడతా. ఉపాధ్యాయిని కావాలన్నదే నా లక్ష్యం' అని పల్లపాటి మహేశ్వరి పేర్కొన్నారు.

నిరాశ్రయ మహిళలకు ఆదరణ: కలెక్టర్



మాట్లాడుతున్న వెట్రిసెల్వి, చిత్రంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిరాశ్రయులైన మహిళలకు ఆదరణ కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మిషన్ శక్తి పథకం ద్వారా జిల్లాలో అమలవుతున్న వన్ స్టాప్ సెంటర్, బేటీ బచావో-బేటీ పఢావో తదితర కార్యక్రమాల అమలుపై గురువారం సమీక్షించి మాట్లాడారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్, డీఎస్పీ శ్రావణ్ కుమార్, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డీసీపీవో సూర్యచక్రవేణి తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఆర్వో డి.పుష్పమణి, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి ఆర్వీ నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఎస్‌డీసీ భాస్కర్, రజక జన సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కట్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● జన సురక్ష పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆయా పథకాల అమలుపై బ్యాంకుల అధికారులతో ఆమె సమీక్షించి మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జీవన్ జ్యోతి బీమా పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని 547 గ్రామ పంచాయతీల్లో జనవరి 15 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జన సురక్ష పథకానికి ఏడాదికి రూ.20, జీవన జ్యోతి పథకానికి రూ.436 ప్రీమియం చెల్లించాలని కోరారు.


పంచాయతీల్లో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్తు కార్యాలయంలోని తన ఛాంబరులో గురువారం పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, మంచినీటి సరఫరా పథకాల నిర్వహణ తదితరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేవస్థానం కాలమానిని, డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు, అధికారులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం 2025 సంవత్సరం నూతన కాలమానిని, డైరీని ఆలయ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు గురువారం ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి, ఈఈ భాస్కర్‌తో కలిసి ఆవిష్కరించారు. సింగిల్ పేజీ కాలమానిని రూ.35, మల్టీ పేజీలైతే రూ.120, డైరీ ధర రూ.150లుగా నిర్ణయించామన్నారు.

దారంతా గోతులే!



వెర్ల ఆసుపత్రి ముందు ఇలా..

భీమడోలు మండలం పొలసానిపల్లి నుంచి ద్వారకాతిరుమల వెళ్లే రహదారి గోతులమయమైంది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఈ రహదారిలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మరమ్మతులు చేపట్టినా అవి మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -ఈనాడు, ద్వారకాతిరుమల



ద్వారకాతిరుమలలో ఛిద్రమైన రహదారి



గొల్లగూడెంలో గోతులు

ఉన్నత విద్యతో అపార అవకాశాలు



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: భారతీయ విద్యార్థులు యూఎస్‌ఏలో ఉన్నత విద్యను అభ్యసిస్తే ఎన్నో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ఏపీ నిట్ డీన్ (స్టూడెంట్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్) డాక్టర్ కార్తీక్ శేషాద్రి సూచించారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలో అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో 'హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూఎస్‌ఏలో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలా మంది కలలు కంటుంటారని, కాని అక్కడ ఎలాంటి కోర్సులు అందుబాటులో ఉంటాయో, సౌకర్యాలు వంటివి తెలియక వెనకడుగు వేస్తారని తెలిపారు. విదేశాల్లో ఎంఎస్ కోర్సులకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం రమణక్కపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పసుమర్తి రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు వాకా నాగరాజు గురువారం తెలిపారు. ఈ నెల 15న ఉమ్మడి కృష్ణా జిల్లా నున్న జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-17 విభాగంలో ముగ్గురు, అండర్-14 విభాగంలో నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరు త్వరలో నంద్యాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



చెక్కులందుకున్న బాలికలతో డీఎంహెచ్‌వో శర్మిష్ఠ

విద్యార్థినుల్లో పోటీతత్వం అవసరం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థినులు సామాజిక స్పృహ కలిగి, పోటీతత్వంతో ముందుకు సాగాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ఠ సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా 'సేవ్ గర్ల్స్'పై ఇటీవల నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన 9 మంది బాలికలకు గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోత్సాహక నగదు చెక్కులు పంపిణీ చేశారు. పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా రమణారావు



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా రాయపూర్ ఎన్ఐటీ డైరెక్టర్ ఎన్.వి.రమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రమణారావు గతంలో వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన బాధ్యతలు చేపట్టేవరకు హైదరాబాద్‌లోని ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా కొనసాగుతారని రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి తెలిపారు.

యువంత.. తుళ్లింత

అట్టహాసంగా జిల్లా స్థాయి యువజనోత్సవం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: యువ తరంగం ఉప్పొంగింది. గజ్జెకట్టి ఆడిపాడింది. యువజన సంబరాన్ని అంబరాన్నంటించింది. స్థానిక సెయింట్ థెరిసా కళాశాలలో జిల్లా యువజన సేవల శాఖ(సెట్‌వెల్) ఆధ్వర్యాన గురువారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి యువతీ యువకులు తరలివచ్చారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె మాట్లాడుతూ... దేశ సంస్కృతి, సంప్రదాయాలకు పరిరక్షించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. యువతలో దాగున్న ప్రతిభాపాటవాలను యువజనోత్సవాల ద్వారా వెలికితీయొచ్చన్నారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకరరావు మాట్లాడుతూ... జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువతకు జిల్లా స్థాయిలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జానపద నృత్యం, గీతం, కవిత్వం, చిత్రలేఖనం, కథా రచన, వక్తృత్వం తదితర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో యువత పాల్గొని ప్రతిభ కనబరిచారు. జిల్లా యువజన అధికారి డి.కిశోర్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కృపావరం, జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు, ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రధానాచార్యురాలు పి.రజిత, జిల్లా పర్యాటకాధికారి పట్టాభి, సెట్‌వెల్ మేనేజరు సత్యనారాయణ, కళాశాల ప్రధానాచార్యురాలు పి.మెర్సీ తదితరులు పాల్గొన్నారు.



కలిసి అడుగేయ్.. విజయానికి బాటేయ్



గోపికల నృత్యరూపకం..

● ప్రథమ ❒ ద్వితీయ ✪ తృతీయ విజేతలు వీరే:

బృంద జానపద నృత్యం:

● లక్ష్మీప్రసన్న బృందం(ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల), ❒ సావిత్రి బృందం(చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల), ✪ మీనాక్షి బృందం(కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల)

శాస్త్రసాంకేతిక ఆవిష్కరణలు

● ఎన్.అఖిల(ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల), ❒ పీవీ దీప్తి, ✪ పి.గణేశ్ (ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాల)

బృందం విభాగంలో.. ● కె.లక్ష్మీదుర్గ, ఎస్కే జాస్మిన్(ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల), ❒ కె.అఖిల, కె.సాహ్నవి, ✪ ఎస్కే జీనత్, వి.శ్రవంతి

కవిత్వం(తెలుగు): ● కె.జైఫణీంద్ర(ఏలూరు సీఆర్ఆర్ కళాశాల), ❒ ఆర్.సంతోశ్ (చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల), ✪ డి.రాజ్యలక్ష్మి (ఉద్యాన విశ్వవిద్యాలయం)

ఆంగ్లం: ● ఎండీ బషీరుణ్(ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల), ❒ డి.రేణుష శ్యామ్, ✪ కె.దామినీ సుధ

జానపద గీతం.. ● పి.కల్యాణ్ హరిత(నూజివీడు ట్రిపుల్ ఐటీ), ❒ కె.ప్రశాంత్, ✪ కె.దామినీ సుధ(ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల)

బృందం: ● కె.ప్రశాంత్ బృందం (నూజివీడు ట్రిపుల్ ఐటీ), ❒ చిన్నారి బృందం(ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల), ✪ డి.నవ్యశ్రీ బృందం (నూజివీడు ట్రిపుల్ ఐటీ)

చిత్రలేఖనం: ● ఎండీ సమీర్(ఏలూరు), ❒ ఎన్.దుర్గ, ✪ సీహెచ్ గాయత్రి

కథా రచన: ● కె.దామినీ సుధ(ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల), ❒ ఎ.సుజాత, ✪ జి.ఇందు నాగ వెంకట పద్మావతి

రాష్ట్రాభివృద్ధే పవన్ కల్యాణ్ ధ్యేయం



ఎంపీపీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న శివశంకర్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. చాటపర్రులోని ఓ హాలులో గురువారం పార్టీ సమావేశం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ బాధ్యురాలు ఘంటసాల వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. ఏలూరు ఎంపీపీ పి.శ్రీనివాసరాజు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జనసేనలో చేరారు. వారికి శివశంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

'టెట్'కు 331 మంది హాజరు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్షలు' (టెట్) కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 370 మంది అభ్యర్థులకు 331 మంది హాజరయ్యారు. మిగతా 39 మంది గైర్హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగర శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... సత్రంపాడు రైల్వే కింది వంతెన సమీపాన గురువారం సుమారు 35 నుంచి 40 ఏళ్లలోపు వయసున్న వ్యక్తి తిరుపతి- కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఘటనా స్థలిని రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రైల్వే ఎస్సై సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురు రేషన్ డీలర్లపై కేసులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా చౌక ధరల దుకాణాలపై దాడులు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో జిల్లాలోని ఎంఎల్ఎస్ కేంద్రాలు, చౌక దుకాణాలు, ఎండీయూ ఆపరేటర్ల పనితీరుపై అధికారులతో గురువారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... ఆయా డీలర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. నిత్యావసర సరకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.05 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

21 నుంచి జాతీయ సదస్సు



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే): వ్యవసాయరంగ సమస్యలపై ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ వేదికగా జాతీయ రైతు సదస్సు నిర్వహిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక అన్నే భవన్‌లో సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బిక్క భాస్కరరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు, ఐక్య ఉద్యమాల ప్రాధాన్యం తదితరాలు చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన


బాలల హక్కులు వివరిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: బాల్యం నుంచే విద్యార్థులు న్యాయవ్యవస్థ, బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ రత్నప్రసాద్ అన్నారు. స్థానిక గ్రేవియరీనగర్‌లోని సెయింట్ గ్రేవియర్ బాలుర వసతి గృహాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ ఆహార పదార్థాల నాణ్యత, సౌకర్యాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్యానల్ లాయర్ వెంకటేశ్వరరావు, వసతి గృహ అధికారి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: కొత్తపేట సబ్బవరపువారిపేట కూడలిలో వీధి కుక్కలు బెడద అధికంగా ఉంది. గుంపులుగా తిరుగుతూ పాదచారులు, వాహన చోదకులపై దాడులు చేస్తున్నాయి.
- పెద్దిరెడ్డి నారాయణ, స్థానికుడు

సమాధానం: వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.
- భానుప్రతాప్, నగరపాలక అధికారి

సమస్య: ఏలూరు- చింతలపూడి రోడ్డులోని రాజరాజేశ్వరి నగర్ మూడో రోడ్డులో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద అధికంగా ఉంది.
- వి.వి.ఎస్.బాలరాజు, స్థానికుడు

సమస్య: గవరవరం న్యూ అశోకనగర్ లయన్స్ క్లబ్ రోడ్డులోని నివాసాల ముందున్న కాలువల్లో మురుగు ముందుకెళ్లడం లేదు. రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది.
- మోహనకృష్ణ, స్థానికుడు

సమాధానం: ఆయా ప్రాంతాల్లోని కాలువల్లో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం.
- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి

సమస్య: పాత బస్టాండ్ కూడలి వద్ద రాత్రివేళ గోవుల సంచారం ఎక్కువగా ఉంది. చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- జీ.ఎం.వి.వి.ప్రసాదరావు, న్యాయవాది

సమాధానం: ఆవులను రోడ్లపై వదలకుండా యజమానులకు నోటీసులు అందజేస్తాం.
- భానుప్రతాప్, నగరపాలక అధికారి

ఉంగుటూరు, న్యూస్‌టుడే

సమస్య: చేబ్రోలులోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహం వద్ద వీధి దీపం కొన్నాళ్లుగా వెలగడం లేదు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం.
- ప్రసాద్, స్థానికుడు

పరిష్కారం: వీధి దీపానికి త్వరితగతిన మరమ్మతు చేయిస్తాం.
- శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి

వెలిగిన వీధి దీపం.. ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల ముందు రోడ్డులో వీధి దీపం వెలిగింది. రోజుల తరబడి దీపం వెలగకపోవడంపై 'మేమున్నాం..' శీర్షికలో ఈ నెల 12న వార్త ప్రచురితమైంది. విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి, సిబ్బందిని పంపి దీపానికి మరమ్మతులు చేయించారు.

పూడిక తొలగింపు.. శాంతినగర్ రెండో రోడ్డులోని మురుగు కాలువను సిబ్బంది శుభ్రం చేశారు. కాలువలో మురుగు పేరుకుపోవడంపై ఈ నెల 12న ప్రచురితమైన వార్తకు నగరపాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలో పూడిక తొలగించారు.

దోమల నివారణ మందు పిచికారీ.. ఆముదాల అప్పలస్వామి కాలనీ గాంధీ పార్కు రోడ్డులోని మురుగు కాలువల్లో పూడిక తీయించి, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కాలువల్లో పూడిక నిండిపోవడంపై ఈ నెల 9న ప్రచురితమైన వార్తకు నగరపాలక ఆరోగ్య అధికారి శివారెడ్డి స్పందించి, సమస్యను పరిష్కరించారు.

మార్పులు చేసేనా.. మోక్షం లభించేనా..!

★ నేటి నుంచి భూముల రీ సర్వే గ్రామసభలు ★ రైతులను వెన్నాడుతున్న గత పాలకుల పాపాలు


ఈయన పేరు చింత పల్లి నారాయణరెడ్డి. ఉంగుటూరు మండలం రామారం. పదెకరాల్లో చేపల చెరువు ఉంది. మరో 11.63 ఎకరాల విస్తీర్ణంలో ఉమ్మడి చెరువులో.. ఈయన పేరిట మరో 4.63 ఎకరాలుంది. రీ సర్వే అనంతరం ఉమ్మడిగా ఎల్పీఎం నంబర్లు కేటాయించగా- వెబ్‌ల్యాండ్‌లో 1బీ, అడంగల్ రాకపోవడంతో భూములపై తీసుకున్న రుణాలు నవీకరించలేక పోతున్నామని, వడ్డీలు పెరుగుతున్నాయని నారాయణరెడ్డి వాపోతున్నారు.

ఉంగుటూరు, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా భూముల రీ సర్వే చేపట్టారు. వాటి ఫలితంగా తలెత్తిన సమస్యలు, వివాదాల్ని పరిష్కరించేందుకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో 18 నుంచి సభలు నిర్వహించి.. సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. తదనుగుణంగా అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆపై క్షేత్ర పరిశీలన చేసి.. రైతుల సమస్యలు పరిష్కరించనున్నారు.

గతమంతా గందరగోళం.. జగనన్న భూరక్షలో భాగంగా నిర్వహించిన భూముల రీ సర్వే అంతా గందరగోళంగా సాగింది. అత్యాధునిక యంత్రాలు, డ్రోన్లతో ప్రక్రియ చేపట్టినా.. పొరపాట్లు తప్పలేదు. అధికారులకు తగినంత సమయం ఇవ్వకుండా.. లక్ష్యాలు నిర్దేశించడంతో.. వారు మొక్కుబడిగా రీ సర్వేని ముగించేశారు. పలు గ్రామాల్లో సర్వే రాళ్లు సైతం పాతలేదు. పాత సమస్యలు తీరకపోగా, కొత్తవి తలెత్తుతున్నాయి. సర్వే నంబర్లు తప్పు రావడం, విస్తీర్ణం తక్కువ చూపడం తదితరాల వ్యధలతో రైతులు సతమతమవుతున్నారు.


డ్రోన్‌తో సర్వే చేస్తున్న అధికారులు (పాత చిత్రం)

అన్నింటికీ ఆటంకాలు

బ్యాంకు రుణాలు నవీకరణ(రెన్యువల్)కు 1బీ, అడంగల్ పత్రాలు తప్పనిసరి. ఈ పత్రాల్లోని భూముల వివరాలు పరిశీలించాకే, బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేస్తారు. రీ సర్వే పూర్తయిన చాలా ప్రాంతాల్లో ఆన్‌లైన్‌లో 1బీ, అడంగల్ పత్రాలు రావట్లేదు. రైతులు భూముల(స్థిరాస్తి) విక్రయించుకోవాలన్నా, రుణాలు పొందాలన్నా వీలుకావడం లేదు. ఉంగుటూరు మండలంలోని ఆరు గ్రామాల్లో రీసర్వే సభల నిర్వహణకు షెడ్యూలు విడుదల చేశారు. అధికారులు, సర్వేయర్లు గ్రామసభల్లో పాల్గొని అర్జీలు స్వీకరిస్తారు. భూ విస్తీర్ణంలో తేడాలు, ఉమ్మడి భూముల విభజన, రైతుల దస్త్రాల్లో పొరపాట్లు తదితర సమస్యలు పరిష్కరిస్తాం' అని ఇన్‌ఛార్జి తహసీల్దారు పూర్ణ చంద్రప్రసాద్ తెలిపారు.

నియోజకవర్గ సమాచారం

మండలం	రీ సర్వే పూర్తయిన గ్రామాలు	సర్వే నంబర్లు	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఎల్పీఎం నంబర్లు
ఉంగుటూరు	6	2,322	11,936.82	7,660
భీమడోలు	3	661	4,202.68	2,774
నిడమర్రు	2	291	937.48	414
గణపవరం	13	2,379	10,331.80	5,511

అభ్యసన సామర్థ్యాలు పెంచుదాం

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో అభ్యసన లోపాలను గుర్తించి, వారిలో సామర్థ్యాలు పెంపొందించాలని ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూర్ మీరా సాహెబ్ సూచించారు. నారాయణపురం ఉన్నత పాఠశాలలో గురువారం అభ్యసన వైకల్యం(డిస్లెక్సియా) వారోత్సవాలు నిర్వహించారు.

నిడమర్రు (గ్రామీణ): స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యాన అభ్యసన వైకల్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో బాలయ్య ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఉపాధ్యాయిని నవశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శన చేపట్టారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

భీమడోలు, న్యూస్‌టుడే: స్థానిక మూడు గుళ్ల ప్రాంతంలో శ్రీసత్యసాయి సేవా, బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యాన మహిళలకు మగ్గం, జర్దోసి శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. బైరెడ్ సంస్థ సహాయక సంచాలకుడు శ్రీనివాస్, సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రసాద్, సేవాదళ్ కన్వీనర్లు శ్యాంప్రసాద్, సత్యసాయి తదితరులు హాజరై మాట్లాడారు.

విద్యుత్తు ఛార్జీల రద్దుకు డిమాండ్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి కిశోర్ డిమాండ్ చేశారు. నగరంలో పార్టీ సమావేశం నిర్వహించారు. విద్యుత్తు ఛార్జీల పెరుగుదలను నిరసిస్తూ శుక్రవారం ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

గ్రామాలను ప్రగతి పథంలో నడిపిస్తాం


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ధర్మరాజు తదితరులు

భీమడోలు, న్యూస్‌టుడే: గ్రామాలను ప్రగతి పథంలో నడిపించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. 'పల్లె పండగ'లో భాగంగా గుండుగొలనులో రూ.45 లక్షలు, కొలుకులూరులో రూ.10 లక్షలు, లక్ష్మీపురంలో రూ.7 లక్షలు, ఆగడాలలంకలో రూ.20 లక్షలు, చెట్టున్నపాడులో రూ.10 లక్షలు, సూరప్పగూడెంలో రూ.10 లక్షల అంచనాలతో నిర్మించనున్న సీసీ రహదారులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.22 కోట్లతో 20 కి.మీ. మేర సీసీ, 14 కి.మీ.లు బీటీ, మరో 7 కి.మీ.లు మెటల్ రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొలుకుల్లు పంచాయతీ రత్నాపురంలో రూ.25 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ధర్మరాజు ప్రారంభించారు. నాయకులు కొండబాబు, నాగగోపాలరావు, పెద్దిరాజు, మదన్, ప్రవీణ్‌పటేల్ కుమార్, సర్పంచులు లక్ష్మి, బాలాజీ, సుబ్బలక్ష్మి, రాంబాబు, వెంకటనరసమ్మ పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు


భూమి పూజ చేస్తున్న ప్రభాకర్

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: పల్లె పండగలో భాగంగా నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చాటపర్రు యాదవుల పేటలోని ఎంపీపీ పాఠశాల నుంచి బాబుజగ్జీవన్‌రాం వరకు రూ.14 లక్షలు, మాదేపల్లి బీసీ కాలనీలో రూ.9 లక్షలతో రోడ్ల నిర్మాణాలకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆయా అభివృద్ధి పనులను సంక్రాంతి లోపు పూర్తి చేస్తామన్నారు. ఆయా పనులను ఎంపీడీవో నిరంతరం పర్యవేక్షిస్తూ.. రోజువారీ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఎంపీడీవో శ్రీలత, తహసీల్దార్ శ్రీనివాస్, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

పెదవేగి, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

వరద బాధితులకు విరాళం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏలూరు జలవనరుల శాఖ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రూ.50 వేలు విరాళం అందించింది. ఎస్ఈ సిహెచ్ దేవప్రకాశ్, సొసైటీ కార్యదర్శి బాపయ్య, సంయుక్త కార్యదర్శి డి.రమణ తదితరులు ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వికి గురువారం అందజేశారు.

ఏలూరు సినిమా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబికా డీలక్స్		కమిటీ కుర్రోళ్లు
అంబికా మిని		రామనగర్ బన్నీ
సాయిబాలాజీ		మా నాన్న సూపర్ హీరో
బాలాజీ		స్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1		విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2		వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3		వేట్టయన్
విజయలక్ష్మి మీమ్యాక్స్ 1		దేవర
విజయలక్ష్మి మీమ్యాక్స్ 2		దక్షిణ
విజయలక్ష్మి మీమ్యాక్స్ 3		జిగ్రా
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1		వేట్టయన్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2		వేట్టయన్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3		విశ్వం
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4		విశ్వం

తొలగిన పాదులు

ఈనాడు స్పందన

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలనులోని ఓ విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పాదులను సిబ్బంది తొలగించారు. 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి ఏపుగా పెరిగిపోయిన పాదులు తొలగించి సమస్య పరిష్కరించారు.

అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు


అంజికాదేవి

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: పోణంగి సుందరంగా సత్రంపాడులోని అంజికాదేవి ఆలయంలో అమ్మవారికి మహా పంచామృతాభిషేకం చేశారు. సౌభాగ్యలక్ష్మిదేవి ఆలయంలో లక్ష్మీ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వట్లూరులోని అనఘాలక్ష్మి సమేత దత్తాత్రేయస్వామికి విశేష పూజలు చేశారు. లలితా మహాత్రిపుర సుందరీ అమ్మవారికి ఆలయ ప్రదక్షిణ, పల్లకీ సేవ చేపట్టారు.

నిడమర్రు: పెదనింద్రకొలనులో గంగానమ్మ పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా మధ్య అమ్మవారిని ఊరేగించారు.

మంత్రి నాదెండ్లకు అభినందన

పెదపాడు, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను అప్పనవీడుకు చెందిన పలువురు జనసేన నాయకులు గురువారం కలిశారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు గరికిపాటి నాగేశ్వరరావు, వడ్డీ రమేశ్, శేఖర్, ఎం.పవన్ తదితరులున్నారు.

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి సేవలను కొనియాడారు. ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భీమడోలు: శ్రీరాముని దివ్య చరితను పరమ పవిత్రమైన రామాయణం రూపంలో ప్రపంచానికి అందించిన వాల్మీకి మహర్షి పూజనీయుడని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సూరప్పగూడెంలో వాల్మీకి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.

ఏలూరు విద్యా విభాగం: స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుక నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కళాశాల ప్రధానాచార్యుడు రాముకుమార్ పుష్పాంజలి ఘటించారు. 'మహర్షి వాల్మీకి జీవిత విశేషాల'పై అతిథి ఉపన్యాసమిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యుడు జి.గిరిబాబు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక శాంతినగర్‌లోని ఎంపీ విడిది కార్యాలయంలోనూ వాల్మీకి జయంతి వేడుక నిర్వహించారు.

వాల్మీకి చిరస్మరణీయుడు

వాడవాడలా జయంతి వేడుకలు


ఏలూరు: చిత్రపటం వద్ద పోలీసు అధికారుల నివాళి

నిడమర్రు (గ్రామీణ): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి తహసీల్దారు నాగరాజు పూలమాల వేసి నివాళి అర్పించారు.

గణపవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యులు పి.నిర్మలకుమారి విద్యార్థులకు వాల్మీకి గొప్పదనాన్ని వివరించారు.

ఏలూరు (గ్రామీణ: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉప గ్రంథ పాలకుడు నారాయణరావు ఆధ్వర్యాన వాల్మీకి జయంతి వేడుక నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


చంటికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యమిస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక పవరుపేటలోని విడిది కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఏలూరులో మాల కులస్థులకు సామాజిక భవనం నిర్మించాలని ఆ సంఘం ప్రతినిధులు ఎం.సంతోశ్‌కుమార్, పి.శామ్యూల్ తదితరులు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో పయనింపజేస్తానని తెలిపారు. తెదేపా నాయకులు దాసరి ఆంజనేయులు, రమేశ్ కుమార్, మాణిక్యాలరావు, రమేశ్ బాబు, ప్రసాద్, ఎం.ఆనంద్, దాసరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జడిపించిన వాన

భారీ ఉరుములు, మెరుపులతో జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో గురువారం జడివాన కురిసింది. సుమారు గంటసేపు ఏకధాటిగా వాన పడటంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. అశోక్‌నగర్ పేట, పవరుపేట, కర్రతంతెన రోడ్లపైకి నీరు చేరింది. పత్తేబాద రైతుబజారు ముంపునకు గురైంది. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై.. దట్టమైన మబ్బులు కమ్ముకున్నాయి. ఇంతలోనే పెద్ద పెద్ద చినుకులతో వర్షం మొదలై, ముంచెత్తింది. దాంతో ప్రజల దైనందిన జీవనానికి కొంత ఆటంకం ఏర్పడింది. - న్యూస్‌టుడే, ఏలూరు టూటౌన్


నీట మునిగిన రైతు బజారు ప్రాంగణం


పత్తేబాదలో జలమయమైన రోడ్డు


తడుచుకుంటూ వెళ్తున్న దివ్యాంగురాలు

బకాయిలు చెల్లించకుంటే సమ్మెకు దిగుతాం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఆరోగ్య సిబ్బందికి పీఎఫ్, జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో సమ్మెకు దిగుతామని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమాచార్యులు, దత్తాత్రేయ హెచ్చరించారు. స్థానిక సర్వజన ఆసుపత్రిలో గురువారం సంఘ సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఆయిదు నెలలుగా వేతన బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు చెల్లించని పక్షంలో ఈ నెల 31 నుంచి సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. ఆసుపత్రి పర్యవేక్షకు సుదాకర్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నిడమర్రు, న్యూస్‌టుడే: బువ్వనపల్లి ఉపకేంద్రం పరిధిలోని చానమిల్లి, సిద్ధాపురం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు తీగల నిర్వహణ పనులు చేపడుతున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పెదవేగి: రాయన్నపాలెం విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా రాయన్నపాలెం, కొండలరావుపాలెం, రాట్నాలకుంట, లక్ష్మీగూడెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు.

ఏలూరు టూటౌన్, గ్రామీణ: కొమడవోలు ఆటోనగర్ విద్యుత్తు ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, తీగల మరమ్మతుల దృష్ట్యా కొమడవోలు, ఆటోనగర్, తూర్పులాకులు, సాయినగర్, చాటపర్రు, గుడివాకలంక, తిమ్మారావుగూడెం, కోటేశ్వరరావుపురం, మాదవపురం గ్రామాల్లో విద్యుత్తు ఉండదని ఈఈ తెలిపారు.

★ తంగెళ్లమూడి సెక్షన్ చిందాడగేట్ ఉపకేంద్రం పరిధిలో తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు ఉండదని అంబేడ్కర్ తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

పెదపాడు, న్యూస్‌టుడే: స్థానిక సొసైటీ ఆడిటోరియంలో మార్గదర్శి ఐకేపీ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రిజువెన్ మెడికల్ ఇండియా సీఈవో అలకబాలాజీ గురువారం ప్రారంభించి మాట్లాడారు.

విష ప్రయోగంపై కేసు

పెదవేగి, న్యూస్‌టుడే: ఒంగూరుకు చెందిన సి.శ్రీలత ఆరు కుక్కలు పెంచుకుంటున్నారు. ఈ నెల 16న గుర్తుతెలియని వ్యక్తులు కుక్కలపై విషప్రయోగం చేయడంతో మృతి చెందాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గేదె, దూడ అదృశ్యంపై..

పెదవేగి, న్యూస్‌టుడే: జగన్నాధపురానికి చెందిన మహేశ్వరరావుకు చెందిన గేదె, లేగదూడ బుధవారం నుంచి కనిపించడం లేదు. పాడి రైతు ఫిర్యాదు మేరకు గురువారం అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE ELURU .
E.P.105/2023 O.S. 165/2016
Between
Garimella Veera Raghavamma ...DHR
VS
MIDATHA LAKSHMINARAYANA ...JDR

పై నెంబరు గ్రంథములోని ఈ దిగువ JDR స్థాఫీన హక్కులున్న ఆస్తిని DHR కు బాకీ నిమిత్తం ది.4.11.2024వ తేదీన ఉదయం గం.10.30 నిలకు పై కోర్టు వారు ఎదుట బహిరంగముగా వేలము వేయబడును. కావున పాటలో పాల్గొనదలచినవారు తమ ఆధార్ కార్డులతో ఉదయం 10.30 నిలకే వచ్చి వేలం పాటలో పాల్గొనవలెనని ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

SCHEDULE :
West Godavari District, Dwarakatirumala Mandal, Bhimadole Sub D, **Narayanapuram Village** .Z.Dry.

Item No.1 R.S.No.215 Extent Ac.0.72 Cents
East : Item No.2 herein, **South**: Land of Karuturi Nagaraju, **West** : Land of Midatha Nagalakshmi, **North**: 18 Links width of joint passage
D.H.R Value : 8,00,000/- Ameena Value : 15,84,000/-

Item No.2 R.S.No.215 Extent Ac.0.67 Cents Out of Ac.0-69 Cents
East : Land of Midatha chandrayya in part and item No.3, **South**: Land of Karuturi Nagaraju, **West** : Item No.1 herein, **North**: 18 Links width of joint passage
D.H.R Value : 7,00,000/- Ameena Value : 14,74,000/-

Item No.3 R.S.No.214 Extent Ac.0.25 Cents
East : Road, **South**: Land of Karuturi Nagaraju, **West** : Item No.2 herein, **North**: Land of Midatha Chandrayya
D.H.R Value : 3,00,000/- Ameena Value : 5,50,000/-

Item No.4 R.S.No.215 Extent Ac.0.61 Cents
East : 18 Links width of joint passage, **South**: Road, **West** : Road, **North**: Land of Midatha Veeraswamy
D.H.R Value : 6,00,000/- Ameena Value : 13,42,000/-

Total D.H.R Value : 24,00,000/-
Ameena Value : 49,50,000/-

P.BHASKARA NARASIMHA MURTHY
Advocate, ELURU, Cell: 9848143125

అవి ఇవి అన్నీ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక.. గణపవరం, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థి అఖిల్ శ్రీవర్ధ రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎంపీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు చెప్పారు. విద్యార్థిని పీడీ పద్మావతి, ఉపాధ్యాయులు, సిబ్బంది గురువారం అభినందించారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ.. పెదపాడు, న్యూస్‌టుడే: మండల తహసీల్దారుగా ఎ.కృష్ణజ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రపురంలో పని చేస్తూ బదిలీపై పెదపాడు వచ్చారు. ఆమెకు డీటీ సునీల, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మండల సమావేశం.. పెదవేగి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం.. దెందులూరు, న్యూస్‌టుడే: స్థానిక విద్యానగర్ శ్రీవిద్యా నిలయంలో 1979-80 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు గురువారం తిరిగి కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాలు చేస్తూ స్థిరపడిన వారంతా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొని.. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు.


భావిపౌరులుగా తీర్చిదిద్దుతాం.. కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నమూనా ఎన్నికలు(మాక్ పోలింగ్) నిర్వహించారు. దేశ్ అప్నాయేన్ సహయోగ్ ఫౌండేషన్(డీఏఎస్ఎఫ్) ఆధ్వర్యాన ఆర్థిక్ క్లబ్ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. విద్యార్థులను చైతన్యవంతులను చేసి భావిపౌరులుగా తీర్చిదిద్దుతామన్నారు. డీఏఎస్ఎఫ్ ముఖ్య ఉద్దేశమిదేనని తెలిపారు. అనంతరం ఆర్థిక్ క్లబ్ ద్వారా విద్యార్థులు అభ్యర్థులుగా నామినేషన్లు వేయగా, ఉపాధ్యాయులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియను నిర్వహించారు. లింగపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోను ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యాయులు జికరరావు, గవరయ్య, గంగా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్స్ అధికారిగా రాజశేఖర్.. ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు భవన్‌లోని తన చాంబరులో జిల్లా అకౌంట్స్ అధికారిగా టి.రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్తు అధికారులు, యూనియన్ నాయకులు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భవనాల వివరాలు సేకరణ.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: కైకరంలో పైలెంపల్లి నిర్మాణానికి భూముల కోల్పోయిన ప్రజల వివరాలను ఆర్.ఐ.శేషు గురువారం సేకరించారు. జేఈ భాస్కరరావు, హైవే అథారిటీ ప్రత్యేక ఉపతహసీల్దారు సత్యనారాయణ పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణాల తనిఖీ.. దెందులూరు, న్యూస్‌టుడే: సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశాలనుసారం కొత్తగూడెం, కొవ్వలిలోని చౌక ధరల దుకాణాలను తహసీల్దార్ సుమతి గురువారం తనిఖీ చేశారు. సరకుల దస్త్రాలు, నిల్వలు పరిశీలించారు. నిత్యావసర వస్తువులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పోలవరం

•పోలవరం • చింతలపూడి

ముగిసిన లక్ష కుంకుమార్చన


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం మదనగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గాయత్రీదేవి శరన్నవరాత్రి పీఠం వద్ద నిర్వహిస్తోన్న లక్ష కుంకుమార్చన గురువారం పూర్ణాహుతితో ముగిసింది. గ్రామ సుభిక్షం కోరుతూ మహిళలు ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి ఛైర్మన్ మద్దు గోపాలకృష్ణ తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని పరెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల నిమిత్తం లక్ష్మీగణపతి టౌన్ షిప్, కొత్త బస్టాండ్, ఏలూరు రోడ్డు, మారుతీ నగర్, సూర్య కళాశాల రోడ్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రాధాకృష్ణ తెలిపారు. అదే విధంగా జంగారెడ్డిగూడెం టౌన్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త ఫీడర్ ఏర్పాటు నిమిత్తం డిగ్రీ కళాశాల రోడ్డు, శాలిపేట, జేపీ బజార్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు.

గ్రామ దేవత చీరల వేలం


వేలం నిర్వహిస్తున్న వీర్రాజు తదితరులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మకు భక్తులు సమర్పించిన సుమారు 3 వేలకు పైగా చీరలకు గురువారం రాత్రి ఆలయ కమిటీ ఛైర్మన్ కలగర వీర్రాజు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. రూ.3 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. అమ్మవారి చీరలు దక్కించుకునేందుకు మహిళలు పోటీపడ్డారు.

25న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: కామవరపుకోట ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 25న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెదేపా మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పాల్గొంటారన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎం.సరళకుమారి, తహసీల్దారు జి.ఎలీషా, ఏవో సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

దారులు బాగుపడేదెప్పుడో..?


✪ ఇది గవరవరం, తిమ్మసకుంట రహదారి. మూడేళ్ల కిందటే అభివృద్ధి పనులకు సుమారు రూ.6 కోట్లు మంజూరు కాగా ఇప్పటికే మూడు పర్యాయాలు టెండర్లు పిలవగా గుత్తేదారుల నుంచి స్పందన కరవైందని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.


✪ రాజవరం బ్యాంకు కూడలిలో దుస్థితి ఇది. పొంగుటూరు-లక్ష్మీపురం రహదారిలో భాగంగా ఉన్న ఈ మార్గానికి అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఇటీవల రూ.25 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ డీఈఈ హరికృష్ణ తెలిపారు. మరి పనులెప్పుడు పట్టాలెక్కుతాయో అన్నది పాలకులకే ఎరుక.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే

కొయ్యలగూడెం మండలంలోని కీలక గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గోతులతో వాహన చోదకులకు నరకం చూపిస్తున్నాయి. అధికారులేమో నిధులు మంజూరయ్యాయి గుత్తేదారులు ముందుకు రావడం లేదంటారు. గత వైకాపా ప్రభుత్వంలో పట్టించుకోకుండా అయిదేళ్ల పాటు ఇదే రీతిన ప్రజలను మభ్యపెడుతూ వచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారుల అభివృద్ధి దృష్టి సారించిన నేపథ్యంలో ఇకనైనా పరిస్థితి మెరుగుపడుతుందని సర్వత్రా ఆశలు రేకెత్తుతున్నాయి.


✪ దిప్పకాయలపాడు సమీపంలో కన్నాపురం రహదారి దుస్థితి ఇది. కొయ్యలగూడెం-కన్నాపురం వరకు సుమారు 7కి.మీ.ల మేర రహదారి పూర్తిగా పాడైంది. అంకాలగూడెం, రేపల్లెవాడ, దిప్పకాయలపాడు, కన్నాపురం శివారున భారీ గోతులతో వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. కనీస మరమ్మతులైనా చేయించమని ప్రజలు కోరుతున్నారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామని ఆర్‌అండ్‌బీ డీఈఈ హరికృష్ణ చెప్పారు.

పెద్దవాగు ప్రాజెక్టు బాధితులను ఆదుకోవాలి

వేలేరుపాడు, న్యూస్‌టుడే: ఇటీవల పెద్దవాగు వరదకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు కెచ్చెల రంగారెడ్డి అన్నారు. రామవరంలో గురువారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడేపల్లి, రామవరం పంచాయతీల్లోని పొలాల్లో ఇసుక మేటలు వేసి మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎన్ని గోస్, సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, కట్టం ముత్యాలరావు పాల్గొన్నారు.

విశ్వకర్మ దరఖాస్తుల పునఃపరిశీలన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: నైపుణ్యం కలిగిన వృత్తుల పనివారలను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కోసం సుమారు 3500కు పైగా దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. వాటిలో కేవలం 75 మాత్రమే అర్హత కలిగినవి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు సచివాలయాల ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

గిరిజన ఆవాసాలకు ప్రాధాన్యమివ్వాలి: సీపీఎం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' నిధుల కేటాయింపులో గిరిజన ఆవాస ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.మంగరాజు కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెడ్డిగణపవరం పంచాయతీలో జనసంచారం లేని ఓ ప్రాంతంలో సీసీ రహదారి నిర్మాణం చేయనున్నారని ఆరోపించారు. దీనిపై అధికార్లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు.

కనీస వేతనం అమలు చేయాలి: సీఐటీయూ

కుక్కునూరు, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి సాయికిరణ్ కోరారు. గురువారం కుక్కునూరులో నిర్వహించిన వీఆర్యేల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం నెలకు రూ.10 వేల వేతనంతో వారు పనిచేస్తున్నారన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నా, వేతనాలు మాత్రం పైసా కూడా పెరగడం లేదన్నారు.

ఓటు నమోదు పౌరుల బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న మణిదివ్య

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పద్దెనిమిదేళ్లు నిండిన పౌరులు బాధ్యతగా ఓటు నమోదు చేయించుకోవాలని ఆర్ఐ మణి దివ్య పేర్కొన్నారు. కొయ్యలగూడెం ప్రకాశం కళాశాలల ప్రాంగణంలో గురువారం 'స్వీప్' అవగాహన సమావేశం నిర్వహించారు. ఓటు ప్రాధాన్యం, విశేషాలను విద్యార్థులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యుడు హనుమాన్‌చౌదరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు పెద్దపీట


తాటియాకులగూడెంలో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న బాలరాజు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. 'పల్లె పండగ' సందర్భంగా తాటియాకులగూడెం, పి.రాజవరం, జీలుగుమిల్లిలో సీసీ రహదారుల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తూ సుపరిపాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోర్స పోసమ్మ, నాయకులు సుంకవల్లి సాయి, జి.రవికుమార్, పి.రాము, వనమా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం, మక్కినవారిగూడెం గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గురువారం ప్రారంభించారు. బొర్రంపాలెంలో మద్యం దుకాణాన్ని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి ప్రారంభించారు.

రూ.22 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణం


చింతంపల్లిలో రోషన్‌కుమార్‌కు మహిళల హారతి

చింతలపూడి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో రూ.22 కోట్లతో చేపట్టబోయే సీసీ రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లాయిగూడెం, పోతునూరు, శివాపురం, లింగగూడెం, చింతంపల్లి, సీతానగరం, నామవరం, వెంకటాద్రిగూడెం, వెంకటాపురం గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు ఎమ్మెల్యే గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తేదారులు పనులు చేపట్టేందుకు ముందుకొస్తున్నారంటే.. కూటమి ప్రభుత్వంపై ఎంత నమ్మకం ఉందో అర్థమవుతోందన్నారు. నవంబరు ఒకటి నుంచి అన్ని రహదారుల మరమ్మతులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. అనంతరం శివాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రారంభించారు. చింతంపల్లిలో పలువురు వైకాపా నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు, రావు కిరణ్‌బాబు, చీకటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. 27, 28, 29 వార్డుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ్‌కుమార్ ఇంటి వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ నమోదులో జంగారెడ్డిగూడెం పట్టణం ముందుండాలన్నారు. నాయకులు చేను ప్రసాద్, ఎం.బాలచిట్టెమ్మ, కె.సత్తిబాబు, చిట్టూరి బాపినీడు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం ఆకస్మిక తనిఖీ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ ధాత్రి రెడ్డి గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. స్టడీ అవర్స్‌లో ఉన్న విద్యార్థినులతో మాట్లాడారు. పాఠ్యాంశాల బోధనపై ఆరా తీశారు. భోజనం మెనూ అమలు తీరు తెలుసుకున్నారు. డార్మెటరీ నిర్వహణపై సిబ్బందిని ప్రశ్నించారు. మరుగుదొడ్ల వద్ద విద్యుద్దీపాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీ వెంట ఐటీడీఏ ఏపీవో పీవీఎస్‌నాయుడు, కొయ్యలగూడెం తహసీల్దార్ కె.చల్లన్నదొర ఉన్నారు.

మెరుగైన పరిహారం చెల్లించేందుకు కృషి: జేసీ


రైతుల భూముల దస్త్రాలు పరిశీలిస్తున్న ధాత్రిరెడ్డి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి-పట్టిసీమ వరకు నిర్మించనున్న 365 బీబీ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు మెరుగైన పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. బుట్టాయగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో సేకరించే జిరాయితీ భూములకు సంబంధించిన రైతుల దస్త్రాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం ఆమె పరిశీలించారు. మొత్తం 63.26 ఎకరాలు సేకరించనున్నామని, అందులో 93 మంది రైతులకు చెందిన 34.76 ఎకరాలు జిరాయితీ, 28.50 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. చిన్న చిన్న వివాదాలు ఏమైనా ఉంటే స్థానికంగా రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం జేసీ విలేకర్లతో మాట్లాడుతూ జాతీయ రహదారి భూముల సేకరణకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన 88 వినతులను పరిశీలించామన్నారు. భూసేకరణ పారదర్శకంగా చేస్తామన్నారు. విప్పలపాడు గ్రామాన్ని సందర్శించి సేకరించే భూములను పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు.

నూరు శాతం లక్ష్యాలు సాధించాలి.. మన్యంలో కొండరెడ్డి తెగ గిరిజనుల గ్రామాల్లో ఐటీడీఏ ద్వారా చేపడుతున్న నిర్మాణాలు, ప్రధానమంత్రి జన్‌మన్, విద్య తదితర పథకాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని జేసీ ధాత్రిరెడ్డి అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద గురువారం వివిధ శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు గెడ్డపల్లికి చెందిన గిరిజన మహిళలు నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస కేంద్రాన్ని సందర్శించి, ఉత్పత్తులను పరిశీలించారు. ఏపీవో పీవీఎస్ నాయుడు, వెలుగు ఏపీడీ రాజబాబు, ఏపీఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం


రావికంపాడులో నివాళి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఆదర్శనీయుడని ప్రిన్సిపల్ ప్రసాద్‌బాబు అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వాల్మీకి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు వెంకట్‌లాల్, రమాదేవి, సన్యాసిరావు, హనుమంతురావు, మధు తదితరులు పాల్గొన్నారు. ✦ కామవరపుకోట మండలం రావికంపాడు ఉన్నత పాఠశాలలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు భీమరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బయ్యనగూడెంలో..

చింతలపూడి, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ సంబంధాలను అర్థవంతమైన రీతిలో వివరిస్తూ వాల్మీకి రామాయణం రచించారన్నారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఆదర్శ కావ్యం రామాయణం రచించిన వాల్మీకి మహర్షి జయంతిని ప్రభుత్వ కార్యాలయాలు, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఘనంగా నిర్వహించారు.

మద్యం దుకాణం మార్చాలని ఆందోళన


లింగపాలెంలో నినాదాలు చేస్తున్న స్థానికులు

లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెంలో కొత్తగా మంజూరైన మద్యం దుకాణం చర్చిల మధ్య, దళితవాడలో ఏర్పాటు చేయడంతో మహిళలు, స్థానికులు గురువారం ఆందోళనకు దిగారు. అక్కడి నుంచి మార్చాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి దుకాణాన్ని తాత్కాలికంగా మూయించారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నివాసిత ప్రాంతాలు, పాఠశాలలు, దేవాలయాల సమీపాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకుండా చూడాలని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య కోరారు. నియోజకవర్గంలో ఇప్పటికే కొన్ని చోట్ల దుకాణాలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలపై స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నందున వాటిని పరిగణలోకి తీసుకోవాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

స్వల్పంగా తగ్గిన వరద

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరికి వరద స్వల్పంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గురువారం ఉదయం 27.10 మీటర్లు ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 27కి తగ్గింది. 48 గేట్ల నుంచి 99.40 వేల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నట్లు జలవనరుల శాఖ అధికారులు చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ రామారావు

'ఉద్యోగ ఆంధ్రప్రదేశ్ కూటమి లక్ష్యం'

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉద్యోగ ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్ కరుటూరి రమాదేవి ఇంటి వద్ద గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదయ్యేలా తెదేపా శ్రేణులు కృషి చేయాలన్నారు.

అసంపూర్తి నిర్మాణాల్లో.. అసాంఘిక కార్యకలాపాలు!


రాజవరంలో ఇలా..

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పంచాయతీల్లో చేపట్టిన గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. ఒక్కో దానికి ఉపాధి హామీ, డీఆర్డీఏ నిధులు కలిపి రూ.13 లక్షలు కేటాయించారు. కొయ్యలగూడెం మండలంలో 15 నిర్మాణాలకు కేవలం మూడు చోట్ల మాత్రమే పనులు పూర్తయ్యాయి. మరో మూడు చోట్ల అసలు ప్రారంభమే కాలేదు. మిగిలిన చోట్ల గదుల నిర్మాణం పూర్తయి తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ తదితర పనులు చేయాల్సి ఉంది. మరికొన్ని చోట్ల స్తంభాలపై శ్లాబు నిర్మించి వదిలేశారు. వైకాపా ప్రభుత్వంలో వీటి వంక కన్నెత్తి అయినా చూడలేదు. ఫలితంగా ప్రస్తుతం అసంపూర్తి నిర్మాణాలు అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా మారాయి. దీనిపై పంచాయతీ రాజ్ ఏఈ సురేశ్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

పందుల బెడదతో భయాందోళన



జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. రాజీవ్‌నగర్, బాలాజీ నగర్, డాంగేనగర్, ఇంద్రజిత్‌నగర్, రాజులకాలనీ, ఇందిరానగర్‌కాలనీ, రాముడుకుంట చెరువు, ఆటోనగర్, శేషాద్రినగర్ తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఆయా చోట్ల ఖాళీ స్థలాలను ఆవాసాలుగా చేసుకుంటున్నాయి. పరిసరాలను పాడు చేస్తున్నాయి. ఈ కారణంగా రోగాలు ప్రబలుతాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పందుల సంచారం కట్టడికి చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ కేవీ రమణ తెలిపారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు


పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని గుంజవరం చౌకడిపోను జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య గురువారం తనిఖీ చేశారు. బియ్యం నిల్వలో 9.35 క్వింటాళ్లు, పంచదార నాలుగు పొట్లాల్లో తేడాలు ఉండటంతో డీలర్ గంగరాజుపై 6ఏ కేసు నమోదు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సాయి రాజు ఉన్నారు.

నిర్దేశిత విస్తీర్ణంలోనే పొగాకు సాగు మేలు


మాట్లాడుతున్న ప్రసాద్

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బోర్డు నిర్దేశించిన విస్తీర్ణం మేరకే పొగాకు సాగు చేయడం మేలని, మిగిలిన భూమిలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని పొగాకు బోర్డు ఎన్ఎల్ఎస్ ప్రాంతీయ అధికారి జీఎల్కే ప్రసాద్ రైతులకు సూచించారు. కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. మార్టేరు పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సహదేవరెడ్డి, సీటీఆర్ఐ శాస్త్రవేత్త కస్తూరి కృష్ణ పాల్గొని పలు సూచనలు చేశారు. జీఎల్కే ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే సీజన్‌లో ప్రపంచ మార్కెట్లో డిమాండ్ కంటే పొగాకు ఉత్పత్తి ఎక్కువయ్యే అవకాశం ఉందని, ధరలు గతేడాదిలా ఉండకపోవచ్చన్నారు. సమావేశంలో వేలం కేంద్రం అధికారి గ్రేసీ మార్గరేట్, వ్యవసాయ శాఖ కేఆర్‌పురం సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు బుజ్జిబాబు, ఉద్యానశాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్, పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

హడావుడిగా ప్రారంభించి.. సౌకర్యాలు విస్మరించి!


పునరావాస కాలనీ సమీపంలో కొండ అంచున నిర్మించిన గోదాము

పోలవరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో పోలవరం కృష్ణారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 500 టన్నుల గోదాము మంజూరైంది. నిర్మాణం కోసం నాబార్డు, డీసీసీబీ, సొసైటీ నిధులు రూ.44 లక్షలు కేటాయించారు. పైడిపాక పునరావాస కాలనీ పక్కనే కొండ అంచున స్థలంలో నిర్మాణం ప్రారంభించారు. ఎన్నికల ప్రకటనను పురస్కరించుకుని ఈ ఏడాది మార్చి 10న హడావుడిగా నాటి ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించినట్లు శిలాఫలకం వేసి చేతులు దులుపుకొన్నారు. అయితే అందులో రైతులు ఉత్పత్తులను జాగ్రత్త చేసుకోవడం, ధాన్యం అరబెట్టుకునేలా ఏర్పాట్లు, వాహనాల కోసం ప్రత్యేకంగా రహదారి నిర్మాణం చేయాలి. అప్పటికే గోదాము నిర్మాణానికి కొండ కొంత మేర తొలగించి ఇబ్బందులు పడిన ఇంజినీరింగ్ అధికారులు.. ధాన్యం ప్లాట్‌ఫాం, రహదారి నిర్మాణం విషయాన్ని పక్కనబెట్టారు. దీంతో అటుగా ట్రాక్టర్లు తప్ప భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. కనీస సదుపాయాలు లేని చోట గోదాము నిర్మించి ఉపయోగం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతం మందుబాబులు, నిర్వాసితులకు బహిర్భూమిగా ఉపయోగపడుతోంది. దీనిపై అప్పట్లో పనులు పర్యవేక్షించిన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఇంజినీరింగ్ విభాగం డీఈ పీఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ గోదాము నిర్మాణానికి రూ.33 లక్షలు ఖర్చు చేశామన్నారు. మిగిలిన పనులకు సరిపడా స్థలం లేకపోవడంతో నిధులు ఖర్చు చేయవద్దని సొసైటీ అధికారులు చెప్పారన్నారు.

పోషకాహార ఉత్పత్తుల తయారీ కేంద్రం ప్రారంభం


రిబ్బన్ కత్తిరిస్తున్న దుర్గమ్మ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రాజానగరంలో గిరిపోషణ పేరుతో డ్వాక్రా సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన పోషకాహార ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని సర్పంచి కుంజా దుర్గమ్మ గురువారం ప్రారంభించారు. దీన్ని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద సిబ్బంది నివాస గృహంలో నిర్వహించే వారు. ఆ క్వార్టర్ శ్లాబు వర్షం కారుతుండటంతో నిర్వహణకు పలు అవస్థలు పడుతున్నారు. దీంతో రాజానగరానికి మార్చారు. కేంద్ర నిర్వాహక బృందం నాయకురాలు గెడ్డ వెంకట నాగలక్ష్మి, కేఆర్‌పురంలో మరో కేంద్రం నిర్వాహకురాలు పి.బుల్లెమ్మ, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం ధర్మాజీగూడేనికి చెందిన బాలిక(15) ఈ నెల 17వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

పరిసరాలు పరిశుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గురువారం 'ఈనాడు'లో 'స్వచ్ఛత... ఆచరణలో ఏదీ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో రాణి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శి వెంకటేశ్వరరావు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.

ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని అధిగమించాలి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పుట్టుకతో గానీ, ప్రమాదంలో గానీ శరీర అవయవాలు కోల్పోయిన వారు కృత్రిమ అవయవాలు ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని వైకల్యాన్ని అధిగమించాలని తెదేపా నాయకుడు నెల్లిబండ్ల బాలస్వామి అన్నారు. గురువారం ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో నెల్లిబండ్ల శైలజ, కె.సువర్ణ, నవ నిర్మాణ్ గ్రూప్ డైరెక్టర్ అప్పల వెంకట సాయినాథ్‌ల ఆర్థిక సహాయంతో ముగ్గురికి కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకురాలు గౌరా జ్యోతికుమారి, ఉయ్యూరు లక్ష్మి, డి.చైతన్య, ఎన్.సాయితేజ, హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 99486 40551	కైకలూరు: 73060 88555
ముసునూరు : 93983 81268	కలిదిండి: 90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: కైకలూరు చిన్ని కృష్ణ ఏజెన్సీ ప్రధాన మార్గంలో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **- కృష్ణమోహన్, కైకలూరు**

సమాధానం: వెలగని వీధి దీపం స్థానంలో కొత్తవాటిని అమర్చి సమస్యను పరిష్కరిస్తాం. **- కొండలరావు ఈవోపీఆర్డీ**

శిరస్త్రాణ వినియోగం తప్పనిసరి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్.ఐ. రామకృష్ణ

చాట్రాయి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణ వినియోగం తప్పనిసరి అని ఎస్.ఐ. డి.రామకృష్ణ తెలిపారు. కృష్ణారావుపాలెంలో బుధవారం రాత్రి ఆయన హెల్మెట్ వాడకం, అపరిచిత వ్యక్తుల సంచారంపై ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రీయ రహదారిలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని వాహనదారులతో మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో హెల్మెట్ లేక చాలా మంది మృతి చెందుతున్నారని తెలిపారు. తీవ్రమైన గాయాలపాలై మంచానికి పరిమితమైన కుటుంబాలున్నాయని తెలిపారు.

అమ్మో ఆ దారిలో ప్రయాణమా!

అధ్వానంగా లంక గ్రామాల రోడ్డు..



నందిగామలంక వద్ద బురదలో దిగబడిన ఆటో..



శ్రీరామ్‌నగర్ వద్ద భారీ గోతులతో రహదారి...

మండవల్లి, న్యూస్‌టుడే: అమ్మో ఆ దారిలో ప్రయాణం నరక ప్రాయమంటూ లంక గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షాలకు లంక గ్రామాల రహదారులు బురదతో దారుణంగా తయారవుతున్నాయి. వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా మారిపోతున్నాయి. మరీ ముఖ్యంగా ఇంగిలిపాకలంక నుంచి పెనుమాకలంకకు వెళ్లే దారిలో కనీసం వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. రోడ్డుపై పెద్దఎత్తున గుంతలు పడి ప్రయాణికులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అసలు ఈ రోడ్లు.. ఉన్నాయా? లేవా? అనే సందేహాన్ని ప్రజలకు కలిగించే మాదిరిగా రోడ్లు తయారయ్యాయి. ఎక్కడ చూసినా భారీ గోతులు.. ఎత్తు పల్లాలు.. పక్కనే ఉన్న కాలువలోకి సగం రోడ్డు జారి ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇక చినుకు పడితే వాహనాలు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. వర్షానికి గుంతల్లో నీరు చేరి చేపల చెరువులను తలపిస్తున్నాయి. భారీ ఎత్తున పేరుకు పోయిన బురదలో అడుగు తీసి వేయలేని పరిస్థితి నెలకొంది. నెలలో ఎంతో మంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఆర్టీసీ, ఇతర వాహనాలు వెళ్లే వీలు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తాగునీరు, నిత్యావసర సరకులు తెచ్చుకునేందుకు వీల్లేకపోవడంతో సాయం కోసం ఎదురు చూస్తున్నారు. రాత్రిపూట ఈ రోడ్డులో వెళ్లాలంటేనే వాహన చోదకుల్లో ఆందోళన తప్పదు. ఈ రోడ్డును నిర్మించేందుకు గత ప్రభుత్వంలో 7.8 కోట్లతో శంకుస్థాపన చేసినా రోడ్డును నిర్మించ లేదు. దీనిపై రోడ్లు భవనాల డీఈ విజయ్ శ్రీకర్‌ను వివరణ కోరగా ఇంగిలిపాకలంక నుంచి పెనుమాకలంక వరకు రోడ్డు నిర్మాణానికి నిధులే సమస్య ఉందని తెలిపారు. విడుదలవగానే రోడ్డును నిర్మిస్తాం.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీశ్

మండవల్లి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అచ్యుత అంబరీశ్ పేర్కొన్నారు. మండవల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో పంట చేతికి వస్తుందని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లర్స్ వద్ద సంచులు ముందుగానే ఉండేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్, ధ్రువ పత్రాలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ సిబ్బంది నిత్యం గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినా సహించేది లేదని హెచ్చరించారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు గోపాల్, ఆర్.ఐ. శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి, న్యూస్‌టుడే : రీ సర్వేలో ఎదురైన సమస్యలపై భూమి యజమానుల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఏలూరు ఆర్డీవో అంబరీశ్ వీఆర్వోలకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం రీ సర్వే ప్రక్రియపై సమీక్షించారు. అనంతరం తహసీల్దారు రామకృష్ణతో కలిసి తాడినాడలోని రేషన్ దుకాణాలను పరిశీలించారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అందరూ సమన్వయంతో పని చేసి సకాలంలో రెవెన్యూ సేవలు అందించాలని ఆర్డీవో అచ్యుత అంబరీశ్ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం సాయంత్రం రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. వివిధ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు జె.సుభానీ, ఆర్ఐ శామ్యూల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు కార్యాలయ ఏవోగా కమలా విష్ణు

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి మండల పరిషత్తు ఏవోగా కమలా విష్ణును కృష్ణా జిల్లా పరిషత్తు సీఈవో నియమించగా గురువారం ఇక్కడ ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏవో మురళీమోహన్ ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు.



మరమ్మతులకు గురైన రైల్వే గేటు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరులోని గోపవరం రైల్వే గేటు గురువారం సాయంత్రం మరమ్మతులకు గురవడంతో సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గేటు మూసే క్రమంలో ఒక పక్కన ఉన్న గేట్ కిందకు పడలేదు. దీంతో ప్రయాణికులు వెళ్లేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన సిబ్బంది చైను పట్టుకుని నిలబడి వాహనాల రాకపోకలను నిలువరించారు. రైలు వెళ్లిన అనంతరం గేటుకు మరమ్మతులు చేశారు.



కలిదిండిలో శిలాఫలకం ఆవిష్కరించిన శ్రీనివాస్

రహదారులే.. అభివృద్ధికి సూచికలు

ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, న్యూస్‌టుడే: రహదారులే ఉప్పలేరు లంక గ్రామాల అభివృద్ధికి సూచికలు అని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గురువారం పెదలంక, కలిదిండి గ్రామాల్లో నూతన రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. రోడ్ల ధ్వంసంతో ప్రజలు ఐదేళ్లుగా నానాఅవస్థలు పడ్డారని, ఇప్పుడు కొత్తవి వేస్తుంటే నిజంగానే పల్లెల్లో పండగ వాతావరణం కనిపిస్తోందని అన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు పోకల జోగిరాజు, కూటమి నేతలు వల్లభనేని నాని, పేటేటి సత్యనారాయణ, ముద్దం భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో.. కోరుకొల్లు (కలిదిండి), న్యూస్‌టుడే : కోరుకొల్లులో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సర్పంచి బట్టు లీలాకనక దుర్గ, కూటమి నేతలు చన్నంశెట్టి మురళీకృష్ణ, వలవల రామారావు, తోట రమాదేవి ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అమజాల బాబులు, నున్న సుబ్రమణ్యం, మొగనాటి రాజేశ్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

ముసునూరు, న్యూస్‌టుడే: పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని పలువురు తెదేపా నాయకులు పేర్కొన్నారు. గురువారం పశువైద్యుడు ఎం.చైతన్య ఆధ్వర్యంలో ముసునూరులో 400, కాటేనిపాడులో 550 మంది గొర్రెలు, మేకలు పెంపకందారులకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యులు మాట్లాడుతూ.. నట్టల నివారణ మందుతో మూగ జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ మందు ద్వారా మరణాలు తగ్గి జీవాల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తోట శ్రీనివాసరావు, కొండేటి బాబీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో జీవాలకు మందు వేస్తున్న తెదేపా నాయకులు

సదుపాయాల కల్పనే ధ్యేయం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణాలకు నిధులు విడుదల చేసిందని తెదేపా నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. పెదకామనపూడి, చినకామనపూడిలో పల్లె పండగలో భాగంగా గురువారం ఉపాధి హామీ పథకం నిధులతో రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పర్యాటక అభివృద్ధి శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్ మాట్లాడుతూ ఈ నిధులను సద్వినియోగ పరచుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సర్పంచి చిట్టూరి నాంచారయ్య పాల్గొన్నారు.



చినకామనపూడిలో భూమిపూజ చేస్తున్న వీరమల్లు

మండవల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నిరంతరం జరుగుతున్న పల్లె పండగతో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రగతి నిండుగా ఉంటుందని నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ తెలిపారు. మండవల్లి మండలం ఉనికిలిలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లకు గురువారం శంకుస్థాపన చేశారు. నాయకులు కోటయ్య, సత్తిబాబు, వీరబాబు, విశ్వేశ్వరరావు, గాంధీ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం గోగులంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు ఈ మొక్కలను నాటి సంరక్షించాలని అవగాహన కల్పించారు.

సంపూర్ణ పోషణ్ కిట్ల పంపిణీ

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి అంగన్‌వాడీ-1లో బాలింతలకు, గర్భిణిలకు సర్పంచి మెండా ఝాన్సీ సంపూర్ణ పోషణ్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. మాత శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పెద్దఎత్తున పోషకాహారాన్ని అందిస్తుందని వివరించారు. ఇందులో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గోతులు పూడ్చిన ఆటో డ్రైవర్



మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండల కేంద్రంలోని రోడ్డుపై ఏర్పడిన గోతులను ఆటో డ్రైవర్ బుద్దుల రాముడు పూడ్చి అందరి మన్ననలు పొందాడు. ఇటీవల కురిసిన వర్షాలకు మండవల్లి కైకలూరు సందులో పెద్దఎత్తున గోతులు పడి నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఎవరో వస్తారు ఏదో చేస్తారని చూడకుండా ఆటో డ్రైవర్ తన ఆటోలో కంకర తీసుకువచ్చి గోతులను పూడ్చాడు. నిత్యం వందలాది మంది నడిచే రోడ్డును బాగు చేయడంతో రాముడిని గ్రామస్థులు, ప్రయాణికులు అభినందించారు.

ముదినేపల్లిలో విగ్రహాల తొలగింపు

కనీస సమాచారమివ్వలేదని మండిపడుతున్న ఎస్సీ నాయకులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నెం.165 విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి సెంటరులోని అంబేడ్కర్, వైఎస్ఆర్ విగ్రహాలను గురువారం ఎన్‌హెచ్ గుత్తేదారు సిబ్బంది తొలగించారు. బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్, వైఎస్ఆర్, పోలీసు స్టేషన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలను తొలగించి వాహనాలపై మండల రెవెన్యూ కార్యాలయం వద్దకు తరలించారు. అంబేడ్కర్ విగ్రహం తొలగింపు సమాచారం తమకు గాని, పంచాయతీకి గాని తెలపకుండా రహస్యంగా తీసుకు వెళ్లారని సర్పంచి భర్త, ఎస్సీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు ఆరోపించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని రహస్యంగా తరలించడం అమానుషమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు భూపతి రవీంద్ర అన్నారు.



ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలు

ఏఐ ప్రాజెక్టుల ప్రోత్సాహం దిశగా ట్రిపుల్ ఐటీ ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకుంటున్న ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్ర కుమార్, పరబోలా9 చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ప్రణవ్‌మూర్తి

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ప్రాజెక్టులను ప్రోత్సహించే దిశగా పరబోలా9తో గురువారం ఒప్పందం చేసుకున్నారు. ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ పరబోలా 9 చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ప్రణవ్ మూర్తి సమక్షంలో ఒప్పందం ఖరారు చేసుకున్నారు. ఇన్‌ఛార్జి సంచాలకుడు ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించిన హ్యాక్‌దాన్ పోటీల్లో 12 జట్లు వినూత్న పరిష్కారాలను ప్రదర్శించాయన్నారు. ఈవెంట్లలో మొదటి స్థానంలో నిలిచిన జట్టు రూ.16,000, రెండో స్థానంలో నిలిచిన జట్టు రూ.8000 గెలుపొందినట్లు తెలిపారు. కళాశాలలో సీఎస్సీ విభాగం నుంచి 15 మంది, పరబోలా9 కంపెనీకి ఎంపికైనట్లు చెప్పారు. ఇలాంటి భాగస్వామ్యాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనేక ఆచరణాత్మక అభ్యాస అనుభవాలను ప్రేరేపించడం, నూతన ఆవిష్కరణలకు నాంది పలకగలమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ డీన్ ఆఫ్ అకడమిక్ శ్రావణి, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండి ప్రసాద్, కళాశాల పరిపాలనాధికారి లక్ష్మణరావు, హెచ్‌వోడీ డాక్టర్ డీవీ నాగార్జున దేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటు వేస్తున్న విద్యార్థిని

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: నూజివీడు పరిధిలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బాలికలకు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటరు జాబితా ప్రకటించి, బ్యాలెట్ పేపర్ ముద్రించడం, పోలింగ్ ఏజెంట్ల ఏర్పాటు, పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారుల నియామకంతో సాధారణ ఎన్నికలకు ఏ మాత్రం తీసిపోకుండా ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సాంఘిక శాస్త్ర సహాయకుడు ఎం.సలోమి మాట్లాడుతూ 6, 7 తరగతులకు చెందిన బాలికలకు ఎన్నికలపై అవగాహన కోసం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. సాధారణ ఎన్నికల నిర్వహణలో తీసుకునే జాగ్రత్తలు, ఏర్పాట్లు, సిబ్బంది మొత్తం ప్రక్రియ కొనసాగించి ఎన్నిక నిర్వహించడంతో బాలికలకు సాధారణ ఎన్నికల పోలింగ్‌పై పూర్తి అవగాహన కలిగినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్.ఎం. కొలుసు నాగబాబు, ఉపాధ్యాయులు పి.స్వర్ణలత, పి.ఎస్.ఎన్.ప్రభామణి, బి.సుదర్శనం, బి.అనురాధ, సంగీతం ఉపాధ్యాయురాలు కె.సుధారాణి పాల్గొన్నారు.

జానపద నృత్యాలలో వైవీఎన్ఆర్ కళాశాలకు 3వ స్థానం



కైకలూరు, న్యూస్‌టుడే: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన యువజనోత్సవాలలో కైకలూరు వైవీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జానపద నృత్యాలలో 3వ స్థానాన్ని సాధించినట్లు కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ హరి ప్రసాద్ తెలిపారు. ఏలూరులో నిర్వహించిన ఈ ఉత్సవాలకు కైకలూరు నుంచి విద్యార్థులు పాల్గొని చేసిన నృత్యాలు చూపరుల మన్ననలు పొందాయని చెప్పారు. ప్రిన్సిపల్ కె.సుజాత, వైస్ ప్రిన్సిపల్ ఉదయ్ ప్రకాశరావులు ప్రతిభ చాటిన విద్యార్థులను, కల్చరల్ సమన్వయకర్త, సభ్యులను అభినందించారు

అన్న సమారాధనలు.. ఊరేగింపులు..

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: శరన్నవ రాత్రి ఉత్సవాలు ముగియడంతో మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి అన్న సమారాధనలు, ఊరేగింపులు సాగాయి. పదిరోజుల పాటు విశేష పూజలందుకున్న అమ్మవారిని కైకలూరు మండలం సీతనపల్లిలో ఘనంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారిని ట్రాక్టర్‌పై పెట్టి ప్రత్యేక అలంకరించి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. కనక, తీన్‌మార్ డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలతో ఊరేగించారు. మండవల్లి మండలం చావలిపాడులో ఏర్పాటు చేసిన మండపంలో ఉత్సవాలు ముగియడంతో గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పాఠశాల సందర్శన

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు మండల పరిధిలో ఉన్న కొన్నంగుంటలోని ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి-2 జమలయ్య గురువారం పరిశీలించారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న విధానాన్ని విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు హాజరు నూరు శాతం ఉండేలా చూడాలన్నారు. గైర్హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను పాఠశాలకు రప్పించాలన్నారు.

నూజివీడులో మెప్మా బజార్ ప్రారంభం

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: నూజివీడు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మహిళా సమైక్య సంఘాల ఆధ్వర్యంలో మెప్మా బజారును గురువారం ప్రారంభించారు. మహిళా సంఘాలు స్వయంగా తయారు చేసిన దుస్తులు, అల్లికలు, ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఇందులో మహిళా సమైక్య సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి మరింత పెంచాలి

చాట్రాయి, న్యూస్‌టుడే: పాల ఉత్పత్తిని మరింత పెంచేలా పాడి రైతులు కృషి చేసి ఆదాయ వనరులను పెంచుకోవాలని జిల్లా పాల సమితి డైరెక్టర్ బొట్టు రామచంద్ర రావు కోరారు. కోటపాడు, మంకొల్లు పాల సేకరణ సంఘాల్లో సభ్యులు యలమంచి ప్రసాద్, పి.తిరపతిరావు గృహాల్లో వివాహ కార్యక్రమాలకు బుధవారం రాత్రి హాజరై బంగారు నాణేలను అందించారు. సంఘాధ్యక్షులు సోమవరపు శ్రీనివాసరావు, ఇమ్మడి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ బయ్యా వెంకటేశ్వరరావు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కేంద్ర బృందం సందర్శించింది. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహనలో భాగంగా ఏపీ హెచ్ఎస్ఎస్పీ(దిల్లీ) ఐవీఏ ఆడిట్ బృందం సభ్యురాలు జైత్య నేతృత్వంలో పీహెచ్‌సీ పనితీరును పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులతో ప్రత్యేకంగా మాట్లాడి వారికి సేవలు ఏ రకంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. వార్డులు, రక్త పరీక్షల పరికరాల పని తీరును పరిశీలించారు. అనంతరం దస్త్రాలను తనిఖీ చేశారు. డాక్టర్ నరేంద్ర కృష్ణ, సాయిసుధ, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే తప్పులు సవరించుకునేందుకు అవకాశం



మాట్లాడుతున్న మాధవీరాణి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దుకుని శాశ్వత పరిష్కారం పొందాలని రీసర్వే డీటీ ఉదయగిరి ప్రసాద్ అన్నారు. దాకరం, పేరూరు, మాధవరంలో గురువారం రీ సర్వే గ్రామసభలు నిర్వహించారు. పేరూరు సర్పంచి పుట్టి మాధవీ రాణి మాట్లాడుతూ రీ సర్వే వల్ల వచ్చిన చిక్కులను సరి చేసుకోవడానికి ఇది చక్కటి అవకాశమని, వీటిని సద్వినియోగపరచుకోవాలని సూచించారు.

నేడు రాష్ట్ర స్థాయి కార్మిక సదస్సు



గోడపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: నూజివీడులోని డాక్టర్ ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం ఏలూరు జిల్లా కోశాధికారి మానికల నాగరాజు మాట్లాడుతూ విజయవాడ ఎంబీవీకే భవన్‌లో ఈ నెల 18న రాష్ట్ర స్థాయి కార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అన్ని కార్మిక సంఘాలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు వ్యతిరేకంగా వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు తిరుపతిరావు, గౌరి నాయుడు, సురేశ్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ చికిత్సపై అవగాహన

చాట్రాయి, న్యూస్‌టుడే: క్రమం తప్పకుండా ఫిజియో థెరపీని ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా చేయడం వల్ల చిన్నారుల్లో మార్పు కనిపిస్తుందని డాక్టర్ శ్రీనాథ్ తెలిపారు. చాట్రాయి భవిత కేంద్రంలో గురువారం ఆయన చిన్నారులకు వ్యాయామ చికిత్స నిర్వహించి అక్కడకు వచ్చిన తల్లిదండ్రులకు ఇళ్ల వద్ద పాటించే తీరుపై అవగాహన కల్పించారు. వారంలో ఒకరోజు మాత్రమే తాము ఇక్కడకు వస్తామని, మీరు కూడా రోజూ పాటించేలా చూడాలని, పని ఒత్తిడి ఉన్నా నిత్యం ఉదయం సమయం ఇందుకు కేటాయించాలని వారికి తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాము, ధనలక్ష్మి పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

ముసునూరు, న్యూస్‌టుడే: రామాయణ మహా కావ్య రచయిత వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో జి.రాణి అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ముసునూరు ఎంపీడీవో కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వాల్మీకి రచనలు భవిష్యత్తు తరాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు వాల్మీకి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఛాయాకుమారి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కలిదిండి, న్యూస్‌టుడే : కలిదిండి శాఖా గ్రంథాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. రామాయణ కావ్యాన్ని రచించిన ఆదికవిని స్మరించుకోవడం అదృష్టంగా భావించాలని గ్రంథాలయాధికారి జాజుల రమేశ్‌బాబు పేర్కొన్నారు.



కలిదిండి: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న చిన్నారులు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జిల్లా బాలుర హైస్కూల్ ఆవరణలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. మనిషి మారితే మహర్షి కాగలరనటానికి ఉదాహరణ వాల్మీకి జీవితమేనన్నారు. నాగలక్ష్మి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. కార్యాలయ ఏవో వి.రమణరావు, ఈవోపీఆర్డీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కైకలూరు, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని మహిళ మృతి చెందిన సంఘటన కైకలూరులో గురువారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. పూజారి అనూరాధ(35) అనే మహిళ భర్త చనిపోవడంతో 15 ఏళ్ల కుమార్తె, పదేళ్ల కుమారుడితో కలిసి కైకలూరు కరకట్ట కాలనీలో నివాసం ఉంటూ తాపీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఇరుగు పొరుగు వారితో మాట్లాడుతూ చనిపోవాలని ఉందని చెప్పడంతో వారు మందలించారు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పాఠశాల నుంచి వచ్చి దూలానికి వేళ్లాడుతున్న తల్లిని చూసి పిల్లలు చుట్టు పక్కల వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మృతికి గల కారణాలను విచారిస్తున్నారు. ఈ తరుణంలో మృతురాలి దహన సంస్కారాలకు బంధువులు ముందుకు రాకపోవడంతో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సహాయంతో పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మల్లికార్జునరావు తెలిపారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	మార్టిన్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	వేట్టయన్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	దేవర
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	విశ్వం
శ్రీవెంకటరమణ సినిమాస్	వేట్టయన్
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర